# జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

సంపుటి: 12 | సంచిక: 217 | సోమవారం | 09-03-2026 | పేజీలు: 08 | వెల రూ. 3 | www.epaperjournalistdiary.com


'రంగస్థలం' ఒక బెంచ్‌మార్క్.. చిట్టిబాబు మేకోవర్ వెనుక అసలు కథ ఇదే: సుస్మిత కొణిదెల



08

## మహిళా జర్నలిస్టులకు ప్రత్యేక గుర్తింపు

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి






**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**
దేశంలోని ప్రధాన మెట్రోపాలిటన్ సిటీలు ఎదుర్కొంటున్న ప్రమాదకర పరిస్థితులు సమీప భవిష్యత్తులో హైదరాబాద్‌కు తలెత్తకుండా నివారించడంతో పాటు ఈ నగరాన్ని ప్రపంచంలోనే మేటి నగరాలతో పోటీ పడే విధంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ప్రణాళికలు రూపొందించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. కాలుష్య నియంత్రణలో భాగంగా హైదరాబాద్‌లో తిరిగే ఆర్టీసీ బస్సులను 2026 డిసెంబర్ 9 నాటికి వంద శాతం ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టబోతున్నామని చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జ్యోతిరావు పూలే భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి మహిళా జర్నలిస్టులను

మిగతా 2వ పేజీలో..



## మార్చి 31 లోగా ఇందిరమ్మ ఇళ్లు

- తొలి విడతలో 3.60 లక్షల ఇళ్లను మంజూరు చేస్తూ ఉత్తర్వులు
- ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు ఇళ్లు

**జర్నలిస్ట్ డైరీ,హైదరాబాద్:**
తొలి విడత ఇందిరమ్మ ఇళ్లను మార్చి 31 లోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ప్రజా పాలన దరఖాస్తుల ద్వారా తొలి విడతలో 3.60 లక్షల ఇళ్లను గ్రామీణ ప్రాంతాలకు ప్రభుత్వం మంజూరు చేసింది అయితే ఇంకా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం చాలామంది ఇల్లు లేని నిరుపేదలు ఎదురుచూస్తూ ఉన్నారు. తాజాగా వారందరికీ

మిగతా 2వ పేజీలో..



## శాసన మండలి కి కొత్త భవనం

- 30 కోట్లతో పాత అసెంబ్లీ ఆధునీకరణ
- ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**జర్నలిస్ట్ డైరీ,హైదరాబాద్:**
అసెంబ్లీ ప్రాంగణంలో ఆధునీకరించిన తెలంగాణ శాసనమండలి భవనాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఆధునిక సౌకర్యాలతో

మిగతా 2వ పేజీలో..



## మహిళా లోకానికి కేసిఆర్ అభినందనలు

జర్నలిస్ట్ డైరీ హైదరాబాద్:
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళాలోకానికి మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మహిళలు సామాజిక సంపద సృష్టికర్తలని, దేశాభివృద్ధిలో పురుషుడితో సమానంగా స్త్రీ భాగస్వామ్యం

మిగతా 2వ పేజీలో..

## సెర్ఫ్ కుటుంబ సభ్యులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు



02

## గవర్నర్ కు వీడ్కోలు చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**జర్నలిస్ట్ డైరీ,హైదరాబాద్:**
మహారాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించబోతున్న తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తో కలిసి లోక్‌భవన్‌లో జిష్ణు దేవ్ వర్మతో భేటీ అయ్యారు. గవర్నర్‌గా దాదాపు రెండేళ్ల పాటు తెలంగాణతో ఏర్పడిన అనుబంధం, రాష్ట్రానికి అందించిన సేవలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు గుర్తుచేశారు. ఈశాన్య రాష్ట్రాలతో తెలంగాణకు మధ్య కళలు, సంస్కృతి, సాంకేతిక పరిజ్ఞానం, క్రీడలు, ఆవిష్కరణల వంటి అంశాల్లో నిరంతర సహకారం, పరస్పర అవగాహన కోసం "తెలంగాణ - నార్త్ ఈస్ట్ ఇండియా కనెక్ట్" పేరుతో జిష్ణు దేవ్ వర్మ గారు చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు.





## రైతుల ఖాతాల్లో సబ్సిడీ నిధులు

### వ్యవసాయ మంత్రి తుమ్మల వెల్లడి

### యూరియా కొరత లేకుండా ముందస్తు చర్యలు

**జర్నలిస్ట్ డైరీ,హైదరాబాద్:**
వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి వ్యవసాయ యాంత్రీకరణ పథకం సబ్సిడీ నిధులను నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయ నున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. రానున్న వానాకాలం సీజన్ సన్నద్ధతపై జరిగిన సమీక్షలో మాట్లాడిన ఆయన వచ్చే ఆర్థిక సంవత్సరం నుండి యాంత్రీకరణ సబ్సిడీ నిధులు


మిగతా 2వ పేజీలో..





## హిస్టరీ రిపీట్.. మూడోసారి టీ20 విశ్వవిజేతగా భారత్..

- నరేంద్ర మోడీ స్టేడియంలో భారత్ చారిత్రాత్మక విజయం
- 255 పరుగుల భారీ స్కోర్‌తో కివీస్‌పై ఒత్తిడి
- 96 పరుగుల తేడాతో కివీస్‌పై భారత్ ఘనవిజయం
- 19 ఓవర్లకు కివీస్ ఆలౌట్.

02





## రాష్ట్రపతి నే అవమానిస్తారా..

- మమతా బెనర్జీ తీరు పై ప్రధాని మోడీ ఆగ్రహం

02



## రాష్ట్రపతి కి మీరిచ్చే గౌరవం ఇదేనా ..

ప్రధాని మోడీ కి మమత కౌంటర్

02

# రాష్ట్రపతి నే అవమానిస్తారా..

- **మమతా బెనర్జీ తీరు పై ప్రధాని మోడీ ఆగ్రహం**

**జర్నలిస్ట్ డైరీ,ఇంటర్నెట్ డెస్క్ :**



పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన సందర్భంగా మమతా బెనర్జీ ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై ప్రధాని మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రపతి ముర్ముని మమతా ప్రభుత్వం అవమానించిందన్నారు. మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని దేశంతోపాటు నారీ శక్తి క్షమించదని ఆయన స్పష్టం చేశారు. దేశంలో అత్యున్నతమైన రాజ్యాంగ పదవిలో ఉన్న ఆమెను ఈ విధంగా అవమానించిందంటూ ప్రధాని మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. పశ్చిమ బెంగాల్‌లో శనివారం తన పర్యటన సందర్భంగా మమతా ప్రభుత్వం చేసిన ఏర్పాట్లపై రాష్ట్రపతి ముర్ము అసంతృప్తి వ్యక్తం చేశారన్నారు.

శనివారం పశ్చిమ బెంగాల్‌లో తన పర్యటన సందర్భంగా రాష్ట్రప్రభుత్వం వ్యవహరించిన తీరుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పెదవి విరిచారు. తన పర్యటన వేళ.. రాష్ట్రప్రభుత్వం సరైన చర్యలు చేపట్టలేదని ముర్ము వ్యాఖ్యానించారు. రాష్ట్రపతి ముర్ము వ్యాఖ్యలపై సీఎం మమతా బెనర్జీ తనదైన శైలిలో స్పందించారు. ఇవి బీజేపీ ఆదేశాలతో.. రాజకీయపరమైనవని ముర్ము వ్యాఖ్యలను సీఎం మమతా బెనర్జీ పేర్కొన్నారు.

పశ్చిమ బెంగాల్ వేదికగా అంతర్జాతీయ సంతాలి సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరయ్యారు. దేశ రాష్ట్రపతి హోదాగా అత్యున్నత పదవిలో ఉన్న ముర్ము శనివారం పశ్చిమ బెంగాల్ విచ్చేశారు. ఈ సందర్భంగా సీఎం మమతా బెనర్జీ, ఆమె కేబినెట్ సహచరులు ఎవ్వరూ ఈ కార్యక్రమానికి హాజరుకాలేదు. ఇక ప్రోటోకాల్ ప్రకారం ఎయిర్ పోర్టులో ముర్ముకు వారెవ్వరూ స్వాగతం పలకలేదు.

# మహిళా లోకానికి కేసీఆర్ అభినందనలు

**మొదటిపేజీ తరువాయి**

ఇమిడి ఉందని వ్యాఖ్యానించారు. సంతానోత్పత్తి అనే అనివార్యమైన ధర్మాన్ని పాటించాల్సిన బాధ్యత స్త్రీకి ప్రకృతి కేటాయించిందని వివరించారు. మానవ మనుగడను కొనసాగించే ప్రత్యేక కర్తవ్యాన్ని అనేక కష్టాలతో నిర్వర్తిస్తున్న మహిళ త్యాగశీలి అని కొనియాడారు.

ఆకాశంలో సగమై, అపారమైన శక్తి సామర్థ్యాలు కలిగి ఉన్న మహిళా లోకానికి అన్ని రంగాల్లో పురుషుడుతో సమానమైన అవకాశాలను మరింతగా అందించినప్పుడు మాత్రమే, కుటుంబాభివృద్ధి సంపూర్ణమవుతుందని కేసీఆర్ పేర్కొన్నారు. తద్వారా సమాజ, దేశ, ప్రపంచాభివృద్ధి ఫరిడవిల్లుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో, అనంతర స్వయం పాలనలో తెలంగాణ మహిళల పాత్ర గొప్పదని వివరించారు. మహిళా సాధికారత దిశగా, వారి సంక్షేమం, ప్రగతికోసం పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అమలు చేసిన పలు కార్యక్రమాలను గుర్తు చేశారు.

# రైతుల ఖాతాల్లో సబ్సిడీ నిధులు

**మొదటిపేజీ తరువాయి**

నేరుగా రైతుల ఖాతాలలోకే జమ అవుతాయని చెప్పారు. ప్రస్తుతం, ఎంపిక చేసిన యంత్రాలకు రైతులు వాటా చెల్లించాక, ప్రభుత్వం 40% సబ్సిడీని కంపెనీలకు విడుదల చేస్తోందని ఆయన పేర్కొన్నారు. రానున్న వ్యవసాయ సీజన్‌లో 1.50 కోట్ల ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశముందని మంత్రి చెప్పారు. రైతులకు రానున్న సీజన్ లో యూరియా కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. 11.50 లక్షల టన్నుల యూరియా కేటాయించాలని కేంద్రాన్ని కోరినట్టు తుమ్మల వెల్లడించారు. యూరియా సరఫరా ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రంతో సంప్రదింపులు జరపాలని అధికారులను ఆదేశించారు.


వేదికలలో సౌరవిద్యుత్ ప్యానెళ్లను ఏర్పాటు చేయాలని కూడా నిర్ణయం తీసుకున్నామని చెప్పారు.

# రాష్ట్రపతి కి మీరిచ్చే గౌరవం ఇదేనా..

- **ప్రధాని మోడీ కి మమత కౌంటర్**

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**

పశ్చిమబెంగాల్‌లో పర్యటన సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్మును అవమానించారంటూ తృణమూల్ కాంగ్రెస్‌పై ప్రధాన మంత్రి విమర్శించడంతో కేంద్రం, మమతా సర్కార్ మధ్య రాజకీయ వివాదం తీవ్రమైంది. తాజాగా మమతా బెనర్జీ 2024 నాటి ఒక ఫోటోను షేర్ చేశారు. ఇందులో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నిలుచుని ఉండగా, మోదీ కూర్చుని ఉండటం కనిపిస్తోంది. 'రాష్ట్రపతిని గౌరవించడమంటేనా ఇదేనా' అని మమత ఈ సందర్భంగా నిలదీశారు. మమతా బెనర్జీ షేర్ చేసిన ఫోటో 2024 మార్చి నాటిది. బీజేపీ అగ్రనేత ఎల్‌కే అద్వానీకి దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న'ను రాష్ట్రపతి అందజేసినప్పటి ఫోటో ఇది. ఆ సమయంలో అద్వాణీ పక్కనే మోదీ కూర్చుని ఉన్నారు. తాజాగా పశ్చిమబెంగాల్‌లో రాష్ట్రపతి పర్యటన సందర్భంగా ఆమెను మమత ప్రభుత్వం అవమానించిందంటూ ఓ ట్వీట్‌లో మోదీ తప్పుపట్టారు. దీనిపై మమతా బెనర్జీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో కౌంటర్ ఇచ్చారు.



## బమ్రుక్ ఉద్దౌలా చెరువు
# నేడు ప్రారంభోత్సవం

**జర్నలిస్ట్ డైరీ,హైదరాబాద్:**

బతుకమ్మ కుంటను పునరుద్ధరించి అందరి ప్రశంసలు పొందిన తెలంగాణ ప్రభుత్వం మరో చెరువుకు జీవం పోసింది. ఓల్డ్ సిటీలోని బమ్రుక్ ఉద్దౌలా చెరువును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ప్రారంభించనున్నారు. రాత్రి 7:30 గంటలకు ఈ చెరువును సీఎం ప్రారంభించనున్నారు.

చెరువు ఓల్డ్ సిటీకి తలమానికంగా ఉంది. అలానే 450 ఏళ్ల చరిత్రను కలిగి ఉంది. ఈ చెరువును తొమ్మిది కోట్లతో పూర్తి చేశారు. 30 ఎకరాల విస్తీర్ణంలో బమ్రుక్ ఉద్దౌలా చెరువును తెలంగాణ అభివృద్ధి చేసింది. చెరువు చుట్టూ ఇన్‌లెట్లు, ఔట్‌లెట్లు సహా కీలక నిర్మాణాలు చేపట్టింది. ఈ చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్‌లు, లైటింగ్, పిల్లల ప్లే ఏరియాలు, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. అలానే ఈ ప్రాంతంలో భద్రత కోసం ఏర్పాటు చేస్తున్న సీసీటీవీ కెమెరాల ద్వారా హైడ్రా ప్రధాన కార్యాలయం నుంచి నిరంతరం మానిటరింగ్ జరుగనుంది.

1770లో నిజాం ప్రధాని నవాబ్ రుక్న్ ఉద్దౌలా ఈ చెరువును నిర్మించారు. అప్పట్లో ఈ చెరువు 100 ఎకరాలకు పైగా విస్తరించి ఉండేది. ఈ చెరువులోని నీటిని ఒకప్పుడు సుగంధ ద్రవ్యాల తయారీకి ఉపయోగించేవారని స్థానికులు చెబుతున్నారు. గడిచిన 50 ఏళ్లలో ఆక్రమణలతో ఈ చెరువు రూపురేఖలు కోల్పోయింది. ఈ చెరువు కబ్జాకు గురై.. భారీగా నిర్మాణాలు.. కొత్తగా కాలనీలు వెలిశాయి. రెండేళ్ల క్రితం హైడ్రా ఈ చెరువు ప్రాంతంలో ఆక్రమణలు తొలగించి సుందరీకరణ పనులు ప్రారంభించింది.





# హిస్టరీ రిపీట్.. మూడోసారి టీ20 విశ్వవిజేతగా భారత్..

- **నరేంద్ర మోడీ స్టేడియంలో భారత్ చారిత్రాత్మక విజయం**
- **255 పరుగుల భారీ స్కోర్‌తో కివీస్‌పై ఒత్తిడి**
- **96 పరుగుల తేడాతో కివీస్‌పై భారత్ ఘనవిజయం**
- **19 ఓవర్లకు కివీస్ ఆలౌట్.**

అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియం సాక్షిగా భారత క్రికెట్ చరిత్రలో ఒక అద్భుతమైన అధ్యాయం ఆవిష్కృతమైంది. 2026 టీ20 ప్రపంచ కప్ ఫైనల్ పోరులో న్యూజిలాండ్‌ను 96 పరుగుల భారీ తేడాతో మట్టికరిపించిన టీమ్ ఇండియా, మూడోసారి ప్రపంచ విజేతగా నిలిచి రికార్డు సృష్టించింది. గత 2024 టీ20 ప్రపంచకప్ గెలుపు జ్ఞాపకాలను గుర్తుచేస్తూ.. వేలమంది అభిమానుల 'వందేమాతరం' నినాదాల మధ్య భారత్ విశ్వవిజేతగా నిలిచింది. ఈ విజయంతో టీ20 ప్రపంచకప్ చరిత్రలో వరుసగా రెండుసార్లు (బ్యాక్‌టుబ్యాక్) టైటిల్ నెగ్గిన మొదటి జట్టుగా, అలాగే మూడుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ఏకైక జట్టుగా భారత్ తన ఆధిపత్యాన్ని చాటుకుంది.

టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన భారత్, నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 255 పరుగుల భారీ స్కోరును సాధించింది. సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్‌లు కివీస్ బౌలర్లపై కనికరం లేకుండా విరుచుకుపడి సిక్సర్ల వర్షం కురిపించారు. 256 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్‌ను భారత బౌలర్లు ఆది నుంచే ఒత్తిడిలోకి నెట్టారు. ముఖ్యంగా లోకల్ హీరో అక్షర్ పటేల్ పవర్‌ప్లేలోనే ఫిన్ అలెన్ వంటి ప్రమాదకర బ్యాటర్‌ను అవుట్ చేసి భారత్‌కు శుభారంభం అందించాడు. ఆ తర్వాత జస్ప్రీత్ బుమ్రా తన బౌలింగ్ మాయాజాలంతో కివీస్ ఆశలపై నీళ్లు చల్లాడు. కేవలం 15 పరుగులిచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టిన బుమ్రా, ఒక దశలో హ్యాట్రిక్ తీసేంత పని చేశాడు. మిచెల్ సాంట్నర్, జేమ్స్ నీషమ్ వంటి సీనియర్లను తన అద్భుతమైన స్లోయర్ డెలివరీలతో బుమ్రా క్లీన్ బౌల్డ్ చేయడం మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది. న్యూజిలాండ్ జట్టులో టిమ్ సీఫెర్ట్ ఒక్కడే 52 పరుగులతో పోరాడినప్పటికీ, వరుణ్ చక్రవర్తి అతడిని అవుట్ చేయడంతో కివీస్ పతనం పూర్తయింది. చివరలో అభిషేక్ శర్మ బౌలింగ్‌లో జాకబ్ డఫీ వికెట్ తీయడంతో న్యూజిలాండ్ 19 ఓవర్లలో 159 పరుగులకే కుప్పకూలింది. ఫీల్డింగ్‌లో కూడా భారత్ అద్భుతమైన ప్రతిభ కనబరిచింది. ముఖ్యంగా ఇషాన్ కిషన్, తిలక్ వర్మలు పట్టిన క్యాచ్‌లు మ్యాచ్ ఫలితాన్ని శాసించాయి. ఈ విజయంతో భారత్ కేవలం టైటిల్‌ను గెలవడమే కాకుండా, టీ20 ఫార్మాట్‌లో తామే అసలైన 'బాస్' అని నిరూపించుకుంది. మ్యాచ్ ముగియగానే స్టేడియం మొత్తం బాణాసంచా వెలుగులతో, అభిమానుల కేరింతలతో హోరెత్తిపోయింది.

# మహిళా జర్నలిస్టులకు ప్రత్యేక గుర్తింపు

**మొదటిపేజీ తరువాయి**

సత్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, హైదరాబాద్‌ను కాపాడుకోవడానికి, అంతర్జాతీయ నగరంగా రాణించడానికి, దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వానికి అందరి సహకారం కావాలని కోరారు.

"దేశంలోని ప్రధాన మెట్రోపాలిటన్ నగరాలు ఎలాంటి ప్రమాదకర పరిస్థితులు ఎదుర్కొంటున్నాయో మహిళా జర్నలిస్టులు విశ్లేషించాలి. వర్షాలొస్తే ముంబయ్ అతలాకుతలమవుతోంది. వాయు కాలుష్యంతో ఢిల్లీ సతమతమవుతోంది. బెంగుళూరులో ట్రాఫిక్ సమస్యలు, వరదలొచ్చినప్పుడు చెన్నైలో ఏర్పడే ప్రమాదకర పరిస్థితులను గమనిస్తూనే ఉన్నాం. సమీప భవిష్యత్తులో హైదరాబాద్ నివాస యోగ్యం కాని నగరంగా మారే పరిస్థితులు రావొద్దు అన్నారు. ఇలాంటి పరిస్థితులు హైదరాబాద్ నగరానికి తలెత్తకూడదనే ప్రణాళికలు రూపొందించాం. మూసీ రివర్ ఫ్రంట్ ఫేజ్ - 1లో గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం 5 వేల కోట్లు, 10 వేల కోట్లు వెచ్చిస్తున్నారంటూ చిలువలు పలువలు చేసి ప్రచారం చేస్తున్నారు. గాంధీ విగ్రహం కోసం దాదాపు 70 కోట్లు, విజ్ఞాన కేంద్రం, ఆ ప్రాంత అభివృద్ధి మొత్తంగా 200 కోట్లు మాత్రమే ఖర్చవుతుంది. ఈ వాస్తవాలను ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందని అన్నారు.. మహిళా జర్నలిస్టులకు ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపునిస్తుంది. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో పనిచేసే చోట మహిళలకు రక్షణ కోసం కమిటీలను ఏర్పాటు చేస్తాం. రక్షణ కల్పించడమే కాకుండా ప్రభుత్వం అవకాశాలను కల్పిస్తుంది. డెస్క్ జర్నలిస్టుల గుర్తింపు విషయంలో ఎవరికీ అన్యాయం జరగదని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి , కొండా సురేఖ , పొన్నం ప్రభాకర్ , మహమ్మద్ అజహరుద్దీన్ , మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ఐ అండ్ పీఆర్ కమిషనర్ సీహెచ్ ప్రియాంక తో పాటు మహిళా జర్నలిస్టులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



# మార్చి 31 లోగా ఇందిరమ్మ ఇళ్లు

**మొదటిపేజీ తరువాయి**

తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పథకంలో స్థలం కూడా లేని నిరుపేదలకు ప్రాధాన్యత ఇస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం 99 రోజుల ప్రజా పాలన ప్రగతి నివేదిక కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిస్తున్న క్రమంలో ఈ కార్యక్రమంలో భాగంగా కొత్త ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్నారు

. సొంత స్థలం ఉన్న వారికి ఇల్లు కట్టుకోవడానికి ఐదులక్షల ఆర్థిక సహాయాన్ని చేసిన ప్రభుత్వం, నిర్మాణ దశను బట్టి వారానికి ఒకసారి నేరుగా లబ్ధిదారుల ఖాతాలలో జమ చేస్తుంది. జిల్లాల వారీగా కలెక్టర్లు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రక్రియను, పనులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పనులను వేగవంతం చేస్తున్నారు.ఇప్పటికే అనేకచోట్ల ఇళ్ల గృహప్రవేశాలు పూర్తయ్యాయి.ఈ నెలాఖరు నాటికి లక్ష ఇళ్లకు గృహప్రవేశాలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ క్రమంలో తొలిదశ మంజూరైన ఇళ్లకు గ్రౌండింగ్ పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రస్తుత 20 శాతం పనులు పూర్తి కాగా మార్చి 31వ తేదీ లోపు అన్ని ఇళ్ల గ్రౌండింగ్ ముగించాలని జూన్ చివరి నాటికి నిర్మాణాలు పూర్తయ్యేలా లబ్ధిదారులను అప్రమత్తం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.






# శాసన మండలి కి కొత్త భవనం

**మొదటిపేజీ తరువాయి**

రూపుదిద్దుకున్న ఈ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

1905లో నిర్మితమైన ఈ టౌన్ హాల్ భవనం రాజస్థాన్, పర్షియన్ శైలుల అద్భుతమైన కళతో సుందరంగా నిర్మించారు. చారిత్రక ప్రాముఖ్యత కలిగిన ఈ భవనం అప్పట్లోనే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో అసెంబ్లీ, శాసనమండలి రెండూ ఒకే ప్రాంగణంలో పనిచేసేవి. అయితే, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ రెండు సభలు వేర్వేరు భవనాల్లో కొనసాగుతున్నాయి.

ఈ నేపథ్యంలో శాసన కార్యకలాపాలు ఒకే ప్రాంతంలో ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చారిత్రక వారసత్వాన్ని కాపాడే దిశగా చర్యలు చేపట్టారు. హెరిటేజ్ విలువ కలిగిన ఈ భవనాన్ని పరిరక్షిస్తూ ఆధునిక సౌకర్యాలతో పునరుద్ధరించే పనులు చేపట్టారు. సుమారు 30 కోట్ల వ్యయంతో శాసనమండలి భవనం అభివృద్ధి పనులు పూర్తయ్యాయని అధికార వర్గాలు తెలిపాయి.



# సెర్ఫ్ కుటుంబ సభ్యులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు

- **మహిళా దినోత్సవం పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమం**
- **ఆదివాసి భవన్‌లో మహిళా దినోత్సవం**

**జర్నలిస్ట్ డైరీ,హైదరాబాద్:**

మహిళా దినోత్సవం సందర్భంగా సెర్ఫ్ కుటుంబ సభ్యులకు 30 రకాల ఆరోగ్య పరీక్షలు ఉచితంగా నిర్వహించే కార్యక్రమాన్ని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రారంభించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలగా పని చేస్తూ మహిళలు విజయాలు సాధిస్తున్నారన్నారు. ఆదివారం నాడు బంజారాహిల్స్‌లోని కుమురం భీం ఆదివాసి భవన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో సీతక్క తో పాటు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కూడా పాల్గొన్నారు. మహిళా సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. లోన్ బీమాతో పాటు ప్రమాద బీమా కూడా కల్పిస్తున్నామని చెప్పారు. మహిళా సంఘాల ద్వారా లోన్‌లు ఇప్పించి పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. హైటెక్ సిటీలో వందల కోట్ల విలువైన మార్కెట్‌ను మహిళా సంఘాలకు అప్పగించామని గుర్తు చేశారు. సెర్ఫ్ ఆధ్వర్యంలో నాయకత్వంలో మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదుగుతున్నాయని వివరించారు.

తెలంగాణ డయాగ్నస్టిక్స్ ద్వారా స్వయం సహాయక సంఘం సభ్యులకు 30 రకాల ఆరోగ్య పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పంట పొలాల నుంచి అంతరిక్షం వరకూ అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని పేర్కొన్నారు. పంట పొలాల్లో 80 శాతం పని మహిళలే చేస్తారని గుర్తు చేశారు.



బస్ స్టేషన్లు, రద్దీ ప్రాంతాల్లో శిశువులకు పాలిచ్చే గదుల ఏర్పాటు చేస్తున్నామన్నారు. అందుకు సంబంధించిన గదుల నమూనాను మంత్రులు సీతక్క, దామోదర ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్ పర్సన్ బండారు శోభారాణితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# శ్రామిక మహిళల ఉపాధికి గండి కొడుతున్న బీజేపీ

**జర్నలిస్ట్ డైరీ, వికారాబాద్ :**

వికారాబాద్ జిల్లా కేంద్రం పాత ఐసిడిఎస్ ఆవరణలో అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం సందర్భంగా ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసే రామ్ జీ పథకానికి వ్యతిరేకిస్తూ జిల్లా స్థాయి సదస్సు జరిగింది. సదస్సుకు పీ ఓ డబ్ల్యూ జిల్లా కమిటీ సభ్యురాలు ప్రభావతి అధ్యక్షత వహించారు . ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి గీత మాట్లాడుతూ, కేంద్రంలో నరేంద్ర మోడీ ఆధ్వర్యంలోని ఆర్ఎస్ఎస్ బిజెపి నాయకత్వాన ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం ప్రజలపై తన పాసిస్టు దాడిని తీవ్రతరం చేయడమే కాకుండా కనీసం శ్రమ మీద ఆధారపడి జీవించలేని పరిస్థితికి ప్రజలను నెట్టివేస్తుందని,అందులో భాగమే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రద్దుకు పూనుకున్నదని ఆ నేపథ్యంలోనే ముందుకు వచ్చిన విబి జీరాంజీ పథకమని, ఈ పథకం అమలు మూలంగా దేశంలో, తెలంగాణ రాష్ట్రంలో లక్షలాదిమంది గ్రామీణ పేదలు,శ్రామిక మహిళలు ఉపాధిని కోల్పోతారని ఈ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు, మహిళలు ముందుకు రావాలని కోరారు. నేడు మహిళల రక్షణ కోసమని చెబుతున్న నిర్భయ,అభయ,దిశ తదితర ఎన్ని చట్టాలు వచ్చినా మహిళలపై,పసిపిల్లలపై, వృద్ధులపై,ఉద్యోగులపై, చివరికి ప్రాణాపాయం నుంచి కాపాడే మహిళా డాక్టర్ల పై గ్యాంగ్ రేఫ్ లు,మర్డర్ లు జరుగుతుంటే పాలకులకు ఎంత మాత్రం సిగ్గనిపించడంలేదని విమర్శించారు. కులం పేరుతో దళితులను హత్యలు చేస్తున్నారని,బడిలో, గుడిలో దళితులకు స్థానం లేదని పసిపిల్లలను నెలకేసి కొట్టి చంపడం అనాగరిక కాలంలో కూడా జరిగి ఉండదని,అగ్రవర్ణాలు పరువు హత్యలకు పాల్పడుతుంటే నివారణ చర్యలు లేవని



ఆవేదన వ్యక్తం చేశారు. మత మూఢత్వం మనిషిలో ప్రవేశిస్తే మానవత్వమనేదే ఉండదని,మనిషి అన్నీ మరిచిపోయి అనాగరికుడుగా మారుతాడని,మానవత్వమే లేకుంటే మనిషి మనుగడ కష్టమని ఇలాంటి విధానాలకు వ్యతిరేకంగా మహిళలు పోరాటాలోకి ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకురాలు పద్మమ్మ, సరిత, లక్ష్మి, సునీత, ముని, ఎం ఆర్ పి ఎస్ నాయకురాలు పుష్పలత , వివిధ ప్రాంతాల నుండి వచ్చిన మహిళలు పాల్గొన్నారు.

# ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులకు మోడల్ టెస్ట్

**జర్నలిస్ట్ డైరీ పరిగి:**

పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయడం లక్ష్యంగా భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) వికారాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పరిగి పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ పాఠశాలలో మోడల్ టెస్ట్ నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పరిగి పట్టణ ఎస్సై మోహన్ కృష్ణ, ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా నాయకులు , వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం. వెంకటయ్య పాల్గొని పరీక్ష పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మోహన్ కృష్ణ మాట్లాడుతూ, విద్యార్థులు ఎలాంటి భయం, చింత లేకుండా పరీక్షలు రాయాలని సూచించారు.



భవిష్యత్ లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని క్రమశిక్షణతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. చదివిన విషయాలు గుర్తుండేందుకు మోడల్ పేపర్లు ప్రాక్టీస్ చేయడం ఎంతో ఉపయోగకరమని, పదో తరగతి పరీక్షలు జీవితానికి మొదటి మెట్టు అని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం. వెంకటయ్య మాట్లాడుతూ ఈ పరీక్షలు విద్యార్థుల భవిష్యత్‌కు ముఖ్యమైన మొదటి అడుగు అని పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అక్బర్, జిల్లా సహాయ కార్యదర్శి అనిల్ మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయడం కోసం ప్రతి సంవత్సరం జిల్లా వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ మోడల్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో ఉన్న భయాందోళనలను తొలగించి వారి సృజనాత్మకతను వెలికి తీయడమే లక్ష్యమని అన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ ఎప్పటికప్పుడు పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పరిగి పట్టణ అధ్యక్షుడు శివ, పట్టణ కార్యదర్శి ఖలీమ్, డివిజన్ కమిటీ సభ్యులు సుమేర్, శివలీలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# సరస్వతి శిశు మందిర్ వార్షికోత్సవం

**జర్నలిస్ట్ డైరీ, నాగారం:**

ఉప్పల్ కొమ్మిడి కృష్ణ రెడ్డి గార్డెన్స్ లో సరస్వతి శిశు మందిర్ స్కూల్ వార్షికోత్సవం ఆదివారం విద్యార్థుల ఆనందోత్సాహాలతో మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప్పల్ మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు నాట్యం, పాటలు, డ్రామా కార్యక్రమాలతో వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. పాఠశాల పిల్లల యొక్క సృజనాత్మకతను ప్రోత్సహించే వేదికగా ఈ వార్షికోత్సవాలు నిలుస్తాయన్నారు. ప్రతి కార్యక్రమం విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తుందని, వారిలో నాణ్యమైన మానవీయ విలువలను పెంపొందిస్తుందని. వారి అభివృద్ధి కోసం ఇటువంటి కార్యక్రమాలు జరగడం ఎంతో అవసరం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రొఫెసర్ భద్రయ్య, డాక్టర్ హోమియోపతి ప్రిన్సిపాల్ లింగ రాజు, సంస్కృతి ఫౌండేషన్ డైరెక్టర్ నాగ ప్రశాంతి, శ్రీ సరస్వతి విద్యాపీఠం ప్రాంత సహ కార్యదర్శి అర్ధచంద్ర ప్రకాష్ రెడ్డి, పాఠశాల ప్రధాన కార్యదర్శి ప్రసాద్, పాఠశాల అధ్యక్షులు అంకన్నగారి మాధవ్ రెడ్డి, ఉప్పల్ గ్రామ పెద్దలు దుబ్బ నర్సింహ రెడ్డి, గోనె ప్రభాకర్ రెడ్డి, జెట్ట సుధాకర్, సల్ల ప్రభాకర్ రెడ్డి, శంభు ప్రసాద్ గారు,జశ్వంత్ రెడ్డి, స్థానికులు, టీచర్లు, విద్యార్థులు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.





# బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో :**

జిల్లేడు చౌదరిగూడ మండలం వీరన్నపేట గ్రామానికి చెందిన మిద్దె రాములు అనారోగ్యంతో హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ వెంటనే స్పందించి ఎమ్మెల్సీ సురభి వాణి దేవి సహకారంతో సీఎంఆర్ఎఫ్ ద్వారా ర 2,20,000/ ఆర్థిక సహాయం మంజూరు చేయించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షులు హఫీజ్ రాములు కుటుంబ సభ్యులకు ఎల్ఓసీ అందజేశారు. క్లిష్ట సమయంలో అండగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ , ఎమ్మెల్సీ సురభి వాణి దేవి కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో మండలంలోని స్థానిక సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# ఈసిఐఎల్ లో వాకథాన్

**జర్నలిస్ట్ డైరీ, నాగారం:**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ నాయర్ సేవా సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఈసిఐఎల్ లో 3కే వాకథాన్‌ను నిర్వహించారు, నగరం అంతటా ఉన్న సభ్యులను ఒకచోట చేర్చి ఈ వాక్థాన్ ను నిర్వహించారు. ఈ వాకథాన్‌ను ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ అరుణ ప్రారంభించారు. హైదరాబాద్‌లోని 30 కారయోగాల ద్వారా పనిచేసే టిఎన్ఎస్ఎస్, నగరం, దమ్మాయిగూడ కారయోగం నాయకత్వంలో ఈసిఐఎల్, సైనిక్‌పురి, అల్వాల్, ఉప్పల్, సఫిల్‌గూడ కారయోగాల క్రియాశీల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎస్ నగరం, దమ్మాయిగూడ కారయోగం ప్రధాన కార్యదర్శి మరియు జేఏసి నగరం అధ్యక్షుడు జయకుమార్ మాట్లాడుతూ సామాజిక సమానత్వం, మతపరమైన అవగాహన, సాంస్కృతిక సుసంపన్నత, జాతీయ సామరస్యం అవసరమైన వారికి మద్దతు ఇవ్వడం కోసం అంకితమైన విశిష్ట రాజకీయేతర సంస్థగా టిఎన్ఎస్ఎస్ యొక్క నిబద్ధతను పునరుద్ఘాటించారు. ఈ వాకథాన్‌ను టెస్లా ల్యాబ్ మరియు జాయ్ అలుక్కాస్ ఉదారంగా స్పాన్సర్ చేశారు, ఈ చిరస్మరణీయ వేడుక విజయవంతానికి వారి మద్దతు దోహదపడిందని నిర్వహకులు తెలిపారు.




# పారిశుధ్య మహిళలకు సత్కారం

**జర్నలిస్ట్ డైరీ, నాగారం:**

డాక్టర్ ఎ ఎస్ రావు నగర్ డివిజన్ లో మహిళా దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ డివిజన్ టూ ప్రధాన కార్యదర్శి సుంకు శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కాప్రా మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య మహిళా కార్మికులకు శాల్వతో సత్కరించి, కేక్ కట్ చేయించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు, ఈ సందర్భంగా సుంకు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ మహిళ ప్రేమకు ప్రతీక, సహనానికి రూపం, కుటుంబానికి బలం. ఆమె లేకుండా కుటుంబం, సమాజం, ప్రపంచం అసంపూర్తిగా ఉంటుందన్నారు. మహిళలు ప్రతి రంగంలో తమ ప్రతిభను చూపిస్తూ సమాజ అభివృద్ధికి గొప్ప పాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రతి మహిళను గౌరవిద్దాం, ప్రోత్సహిద్దాం, సమాన అవకాశాలు కల్పిద్దాం మని ఆయన అన్నారు. ప్రతి మహిళ ఆర్థికంగా బలపడాలని, సమాజంలో గౌరవంగా బ్రతకాలని మహిళలందరి ముఖంలో చిరునవ్వు వుండాలని, మహిళా సాధికారత కోసం అహర్నిశలు కష్టపడదామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మహిళా కార్మికులు మంజుల, అనురాధ, సునీత, లక్ష్మి, సరస్వతి పాల్గొన్నారు.



# మహిళా కార్మికులకు చీరల బహుకరణ

**జర్నలిస్ట్ డైరీ రంగారెడ్డి జిల్లా బ్యూరో:**


అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని షాద్ నగర్ కమ్మ మహిళా సేవా సమితి ఆధ్వర్యంలో షాద్ నగర్ శివమారుతి అయ్యప్ప దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలో గల ప్రభుత్వ పాఠశాలలలో పనిచేసే పారిశుధ్య మరియు మధ్యాహ్న భోజనం మహిళా కార్మికులను వారి శ్రమను గుర్తించి 66 మంది మహిళా కార్మికులకు చీరలను అందజేసి గౌరవించటం జరిగింది.

ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కమ్మ మహిళా సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ, సమాజానికి తమకు చేతనైన సేవ చేయాలనే సంకల్పంతో గత ఐదు సంవత్సరాల క్రితం ఈ కమ్మ మహిళా సేవా సమితి ని ఏర్పాటు చేసుకొని మొదటిగా జడ్చర్ల లోని మానసిక వికలాంగులకు ఆర్థిక సహకారం అందించడం తో మొదలుపెట్టి, పేద విద్యార్థుల చదువులకు సహకారం, గిరిజన వైద్య విద్యార్థికి ఆర్థిక సహకారం, ప్రమాదంలో గాయపడి నడవలేని స్థితిలో ఉన్న ఒక ప్రవేట్ అధ్యాపకునికి పెద్ద మొత్తంలో ఆర్థిక సహకారం, అలానే మహిళా దినోత్సవం సందర్భంగా ఇప్పటికి షాద్ నగర్లో మున్సిపల్ మహిళా కార్మికులకు , ఆశా కార్మికులకు ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలలలో పనిచేసే పారిశుధ్య మరియు మధ్యాహ్న భోజన కార్మికులకు చీరల ను ఇచ్చి వారు సమాజానికి చేస్తున్న శ్రమను గుర్తించి గౌరవించు కునట్లు తెలిపారు. ఇలా శ్రామిక మహిళలను గౌరవించుకోవడం సంతోషదాయకంగా ఉందన్నారు. ఇది ఒక కుల సంఘంగా కనిపించినా మా మహిళలు అందరూ తలా కొంచెం డబ్బులు జమ చేసుకొని ఇలా సమాజానికి సేవ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. మా ఈ కృషిని గుర్తించిన శేరిలింగంపల్లి శాసన సభ్యులు , కమ్మ వారి సేవా సంఘాల సమాఖ్య తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఆరేకపూడి గాంధీ గారు మా సంఘానికి ఆర్థికంగా సహకరించి మమ్మల్ని ముందుకు నడిపిస్తున్నందుకు వారికి, మమ్మల్ని వెన్ను తట్టి సహాయ సహకారాలు అందిస్తున్న స్తానిక కమ్మ సేవా సమితి నాయకులకు, అలానే ఈ కార్యక్రమానికి విజయవంతం కావడానికి సహకరించిన ఫరూక్ నగర్ మండల విద్యా శాఖ అధికారి మనోహర్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. ముఖ్యంగా తమ దృష్టికి వచ్చే పేద విద్యార్థుల చదువుకు తమ వంతు సహాయం అందిస్తామని , ఎవరైనా అలాంటి ఇబ్బంది ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.





ఈ కార్యక్రమంలో కమ్మ మహిళా సేవా సమితి సభ్యాలు పాతూరి ఇంద్రాదేవి, పాతూరి హైమావతి, పినపాక మంగా దేవి, నువ్వుల రమాదేవి, వట్టికూటి విజయ లక్ష్మి, వట్టికొండ ఉమ, పెద్ది అంజనీ భవాని, మక్కపాటి లక్ష్మి, రాణి, సి.ఆర్.పి నాగమణి '' కమ్మ సేవా సమితి నాయకులు పాతూరి వెంకటరావు, పినపాక ప్రభాకర్, వట్టికొండ ఎర్రయ్య , మక్కపాటి మల్లేశ్వర రావు, వట్టికూటి రామసుబ్బారావు, పాతూరి రఘుపతి, ఆలూరి శ్రీను, కల్లూరి హరి కృష్ణ, మాజీ కౌన్సిలర్ రేటికల్ నందీశ్వర్, దేవాలయం మేనేజర్ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి నిధి ద్వారా ఆర్థిక సహాయం

**జర్నలిస్ట్ డైరీ, ఇబ్రహీంపట్నం :**

ఇబ్రహీంపట్నం మండలం కప్పపహాడ్ గ్రామానికి చెందిన ఇద్దరు బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం మంజూరైంది. గ్రామానికి చెందిన అల్లం అండాలు ముదిరాజ్, ఉడుతల భాగ్యమ్మ గౌడ్ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే వైద్య ఖర్చులు భరించడానికి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటుండడంతో ఇబ్రహీంపట్నం బిఆర్ఎస్వి అధ్యక్షులు నిట్టు జగదీశ్వర్ చొరవ తీసుకుని ప్రభుత్వ పెద్దల దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు.

దీనికి స్పందించిన ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ కింద అల్లం అండాలు ముదిరాజ్ వైద్య ఖర్చులకు 2 లక్షల 10 వేల రూపాయలు, ఉడుతల భాగ్యమ్మ గౌడ్ వైద్య ఖర్చులకు 1 లక్ష 80 వేల రూపాయలు మంజూరు చేసింది. ఈ మేరకు మంజూరైన ఎల్‌వోసీ చెక్కులను ఆదివారం బాధితుల కుటుంబాలకు అందచేశారు.

# రచయితగా గుర్తింపు తెచ్చుకున్న ఉస్మాన్ అలీ

**జర్నలిస్ట్ డైరీ,వికారాబాద్ :**

పరిగి మండలం మిట్టకోడూర్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న ఎం.డి. ఉస్మాన్ అలీ, చిన్నారి బాలబాలికల కోసం గేయాలు, కథలు రచిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు.తన మాతృభాష ఉర్దూ అయినప్పటికీ తెలుగు భాషపై ఉన్న అభిమానం వల్ల చిన్నారులకు అర్థమయ్యే సరళమైన భాషలో అనేక గేయాలు, కథలు రచిస్తున్నారు. హిందువులు కుప్పగా జరుపుకునే దేశంలో హిందువులు గొప్పగా జరుపుకునే ఉగాది, దసరా, దీపావళి, కార్తీక మాసం, సంక్రాంతి వంటి పండుగల సందర్భంగా పిల్లల్లో సాంప్రదాయాలపై అవగాహన పెంపొందించే విధంగా అనేక గేయాలు రచించారు. అలాగే ఎస్‌సీఈఆర్టీ ప్రచురించిన లెర్నింగ్ పుస్తకాలలో సుమారు 20 కథలు రచించారు. అదేవిధంగా “చిన్నారి బడి” అనే పుస్తకాన్ని స్వయంగా రచించి ప్రచురించారు. 2011-2012 సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ప్రచురించిన బాలసాహిత్య పుస్తకాలలో దాదాపు 50 కథలు, గేయాలు



రచించి బాలసాహిత్యంలో తన ముద్ర వేశారు. 2024 సంవత్సరంలో బహుజన సాహిత్య రచయితగా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం నేషనల్ అవార్డు అందుకున్నారు.

ఈ సందర్భంగా మహిళల గౌరవార్థం ఒక ప్రత్యేక గేయాన్ని రచించి మహిళా మణులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు కుటుంబానికి మాత్రమే కాక సమాజ అభివృద్ధికి కూడా ప్రధాన శక్తిగా నిలుస్తారని ఆయన పేర్కొన్నారు. మహిళల ఆశయాలు నెరవేరాలని, వారు మరిన్ని శిఖరాలు అధిరోహించాలని పేర్కొన్నారు.



# శిల్పా నగర్ లో పారిశుధ్య కార్యక్రమం

**జర్నలిస్ట్ డైరీ, నాగారం:**

ప్రజా ఆరోగ్యాన్ని కాపాడడంతో పాటు నివాసితులకు శుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడం లక్ష్యంగా “99 రోజుల పారిశుధ్య కార్యక్రమం ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి నాగారం కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పా శ్రీనివాసరెడ్డి, మద్దతు తెలుపుతూ, కాలనీల అభివృద్ధి మరియు ప్రజల సంక్షేమానికి శుభ్రత, పౌర బాధ్యత ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం కింద 99 రోజుల పాటు నిరంతర శుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తూ చెత్త తొలగింపు, కాలువల శుభ్రపరచడం, మురికి ప్రాంతంలో సమగ్ర పారిశుధ్య పరిస్థితులను మెరుగుపరచడం చేపడతారు. నాగారం శిల్పా నగర్‌ను ఒక ఆదర్శ శుభ్రమైన కాలనీగా తీర్చిదిద్దడం, ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడం మరియు ఇతర కాలనీలకు ఆదర్శంగా నిలిచేలా చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. అలాగే ప్రజలు, స్థానిక నాయకత్వం మరియు అధికారులు కలిసి పనిచేసి శాశ్వత పారిశుధ్యాన్ని సాధించడం కూడా దీని ఉద్దేశ్యంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గణపురం కొండల్ రెడ్డి, చిన్నం రాజు సతీష్ గౌడ్, పంగా హరిబాబు తదితర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మరియు శిల్పా నగర్ కాలనీ సభ్యులు పాల్గొని తమ మద్దతును తెలిపారు. ముఖ్యమైన ప్రజా సమస్యలను పరిష్కరించడంలో స్థానిక ప్రజలు సహకారం ఉండటాన్ని పలువురు అభినందించారు.

# అర్హులందరికీ ఇళ్లు కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**జర్నలిస్ట్ డైరీ, నాగారం:**

అర్హులైన అందరికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం అని మెడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో భాగంగా, స్థలం ఉండి ఇల్లు నిర్మించుకునే ఆర్థిక స్తోమత లేని పేదలకు 5 లక్షల ఆర్థిక సహాయం అందించే ఇందిరమ్మ ఇళ్ల పథకం మహోత్సవం కార్యక్రమం మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఉప్పల్ జోన్ ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని మరిపల్లిగూడా, ఎదులాబాద్ లో ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని మరిపల్లిగూడా, ఎదులాబాద్ లో కార్యక్రమంలో మెడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి భూమి పూజ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్, ఘట్కేసర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముత్యాల యాదవ్, ఘట్కేసర్ మండల్ మాజీ అధ్యక్షులు కర్రే రాజేష్, అమర, విశ్వనాథ్, ఉదయ్ రెడ్డి, కందుల కుమార్, బొక్క ప్రభాకర్ రెడ్డి, మాధవ రెడ్డి, మెట్టు నర్సింహా, సుదర్కర్ రెడ్డి, అంజి రెడ్డి, గిరి, బాలకృష్ణ, ఓమ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





## సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**
అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా సరూర్ నగర్ సీఐ సైదిరెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ ఆదివారం మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు.. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ మహిళా సిబ్బందికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి సన్మానం చేసి బహుమతులు అందజేశారు..



## ఫరూక్ నగర్ ఈద్గా వద్ద ఇఫ్తార్ విందు

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో:**
అల్లాహ్ చల్లని ఆశీస్సులతో అందరూ బాగుండాలనీ షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్ నగర్ పట్టణంలో స్థానిక మైనార్టీ నేతలు జమ్రుద్ ఖాన్, ఎండి ఫర్ధీన్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఫరూక్ నగర్ ఈద్గా వద్ద ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వానికి సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు. ఆయనతో పాటు స్థానిక మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందేమోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, ఎండి ఇబ్రహీం, మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వం, సర్వర్ పాష, అసద్ ముక్తార్ అలీ, ఆసియాన యూసుఫ్ బామస్, కౌన్సిలర్ పెంటయ్య, మురళి మోహన్ అప్పి, సాదిక్, వీర్లపల్లి అన్వర్, మహబూబ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రంజాన్ ఉపవాసాల దీక్ష విరమణ సందర్భంగా మైనార్టీ నేతలకు ఎమ్మెల్యే శంకర్ వారికి ఖర్జూరం పండ్లను స్వయంగా తినిపించారు. ఒకరికొకరు పండ్లను తినిపించుకొని ఉపవాసాన్ని విరమించారు. అనంతరం ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా ఇఫ్తార్ విందు అనంతరం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మీడియాతో మాట్లాడుతూ.. అల్లా దయతో సమాజంలో అందరూ బాగుండాలని శాంతి దయ కరుణ సామరస్యం రంజాన్ సందర్భంగా అందరిలో వెల్లివిరియాలని తెలిపారు. రంజాన్ మాసంలో ధర్మ పరిరక్షణ కోసం ముస్లిం సోదరులు కఠిన ఉపవాస దీక్షలు చేపడతారని తెలిపారు. పదిమంది బాగుపూరే ముస్లిం సమాజంలో ఐక్యతగా ఉంటూ అందరికీ ఆదర్శంగా నిలుస్తారని ఎమ్మెల్యే శంకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జమ్రుద్ ఖాన్, ఫర్దీం, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బస్వం, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ బాబర్ అలీ ఖాన్ మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం,,కౌన్సిలర్లు పెంటయ్య, మురళీ మోహన్(అప్పి), బచ్చలి నరేష్, చందు, అన్వర్, సర్వర్ పాషా, మహబూబ్, సాధిక్, గంగమోని సత్తయ్య, బీరప్ప గోవర్ధన్ గౌడ్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీలో చేరిన కాంగ్రెస్ నాయకులు

**జర్నలిస్ట్ డైరీ, ఆర్కేపురం:**
కాంగ్రెస్ పార్టీ నాయకులు చౌకి సుమన్ ఇతర నాయకులు ఆదివారం ఆర్కేపురం బీజేపీ పార్టీ కార్యాలయంలో బీజేపీ సీనియర్ నాయకులు ధీరజ్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ పార్టీలో చేశాడు. ఈ సందర్భంగా ధీరజ్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని ప్రధాన మంత్రి నరేంద్రమెడీ ఆధ్వర్యంలో చేపడుతున్న సంక్షేమ పథకాలు ఆకర్షితులై యువత బీజేపీ పార్టీలో చేరుతున్నారని అన్నారు. గత 15 సంవత్సరాల నుండి కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన చౌకి సుమన్, రాజు గోపాల్ , చిన్న (మురళీ) మళ్లి తన సొంత గూటికి రావడం శుభ పరిణామంని అన్నారు. ఈ సందర్భంగావారికి బీజేపీ కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు పిట్ట ఉపేందర్ రెడ్డి, వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## గర్భాశయ క్యాన్సర్ నివారణ కోసం ఉచితంగా వాక్సిన్

**జర్నలిస్ట్ డైరీ ,హైదరాబాద్:**
హెచ్పీవీ వ్యాక్సిన్ గర్భాశయ క్యాన్సర్ నివారణ కోసం 14 సంవత్సరాలు నిండిన ఆడపిల్లలు అందరికీ కూడా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వాక్సిన్ ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం రాజంనగర్ సిపిస్సి లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితా దేవి లాంచనంగా ప్రారంభించారు.
ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఎమినైజేషన్ డాక్టర్ శివ హయత్ రాజం నగర్ డిప్యూటీ డిఎం హెచ్వో డాక్టర్ విజయ పూర్ణిమ పాల్గొన్నారు జిల్లాలో ఈ హెచ్ పి వ్యాక్సిన్ షాద్నగర్ సిపిస్సి లో దిష్టి హాస్పిటల్ కొండాపూర్ లో ఏరియా హాస్పిటల్ వనస్థలిపురంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ రాజంనగర్లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మహేశ్వరంలో కమిటీ హెల్త్ సెంటర్ హయత్ నగర్ లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ శంషాబాద్ లో ఉచితంగా ఇస్తారని తెలిపారు.

## జేడీయూలో చేరిన నిశాంత్ కుమార్

**జర్నలిస్ట్ డైరీ,హైదరాబాద్:**
బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తనయుడు నిశాంత్ కుమార్ జేడీయూలో చేరారు. పార్టీ ప్రముఖులు, కేంద్ర నేతలు, కార్యకర్తల సమక్షంలో పాట్నాలోని జేడీయూ ప్రధాన కార్యాలయంలో ఆయన పార్టీలో చేరారు. 40 ఏళ్ల ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ అయిన నిశాంత్‌కు కేంద్ర మంత్రి రాజీవ్ సిన్హా లలన్, జేడీయూ వర్కింగ్ ప్రెసిండెంట్ సంజయ్ ఝా తదితరులు పార్టీలోకి సాదర స్వాగతం పలికారు. నితీశ్ కుమార్ ఇటీవల రాజ్యసభ ఎన్నికలకు నామినేషన్ వేసిన నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకుంది. జేడీయూలో లాంఛనంగా చేరిన అనంతరం నిశాంత్ మాట్లాడుతూ, తన తండ్రి రాజ్యసభకు వెళ్లాలనుకోవడం ఆయన వ్యక్తిగత నిర్ణయమని, దానిని అంతా గౌరవించాలని అన్నారు. ఆయన గైడెన్స్‌లోనే పనిచేస్తామని, పార్టీ పటిష్టతకు తాను కృషి చేస్తానని చెప్పారు. సుదీర్ఘకాలం సీఎంగా పనిచేసిన తన తండ్రి ఇరవై ఏళ్లలో రాష్ట్రానికి ఎంతో చేశారని ప్రశంసించారు.

# మధ్యప్రాచ్యంలో నైతికతకు, వాస్తవికతకు మధ్య సంఘర్షణ: భారత్ పాత్ర

ప్రస్తుత అమెరికాఇజ్రాయెల్ యుద్ధం మధ్యప్రాచ్యాన్ని మరోసారి నిప్పులు గుప్పించేలా చేస్తోంది. ఇరాన్ పై జరుగుతున్న ఈ దాడుల వలన అంతర్జాతీయ చట్టాలు, సార్వభౌమత్వం వంటి ప్రాథమిక సూత్రాలపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. అయితే ఈ సందర్భంలో భారత్ తీసుకుంటున్న విదేశా విధాన వైఖరి మాత్రం చరిత్రాత్మకమైన నైతిక వైఖరికీ, ప్రస్తుత వాస్తవిక రాజకీయాలకూ మధ్య జరుగుతున్న సంఘర్షణకు అద్దం పడుతోంది.

**అమెరికా దాడుల చట్టబద్ధతపై సందేహాలు:**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫిబ్రవరి 28న ఇరాన్ పై 'ఎపిక్ ఫ్యూరీ' ఆపరేషన్ ప్రారంభించారు. ఇరాన్ అణ్వాయుధాల తయారీ పూర్తి చేసుకుంటోందన్న ఆరోపణలతో ఈ దాడులు జరిగాయి. (ఈ విషయం అసత్యం అనే విషయం ప్రపంచానికి తెలుసు ) అయితే, అయితే ఈ యుద్ధం చట్టబద్ధమా! నైతికమా! అన్నది ప్రధాన ప్రశ్న .

ఐక్యరాజ్య సమితి చార్టర్ ప్రకారం, తక్షణ ముప్పు ఉన్నప్పుడు లేదా భద్రతా మండలి ఆమోదం ఉన్నప్పుడు మాత్రమే ఒక దేశం మరొక దేశంపై దాడి చేయవచ్చు. ఇక్కడ ఈ రెండు షరతులు పాటించటం జరగలేదు. ట్రంప్ అసలు ఐక్యరాజ్య సమితినీ, భద్రతా సమితినీ, అంతర్జాతీయ చట్టాలను, అంతర్జాతీయ కోర్ట్ ఆఫ్ జెస్టీస్ అనేవి ఉనికిలో ఉన్నట్లు కూడా ఆయన గుర్తించటం లేదు. పైగా వాటి మనుగడ కోసం అమెరికా ఇతర దేశాలకన్నా ఎక్కువ హృదా ఖర్చు చేస్తుంది అనే భావనతో ఉన్నాడు. కనుక ఐక్యరాజ్య సమితి సలహాలు, సూచనలు పట్టించుకొనే స్థితిలో లేదు. అంతేకాకుండా, దాడులకు ముందు రెండు రోజుల వరకు జెనీవాలో అమెరికాఇరాన్ మధ్య చర్చలు జరుగుతుండటం మరింత ఆశ్చర్యకరం. దౌత్య చర్చలు జరుగుతుండగానే దాడులు ప్రారంభించడం అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని నిపుణులు భావిస్తున్నారు.

అమెరికా జాతీయ గూఢచార సంస్థ డైరెక్టర్ మార్చి 2025లోనే ఇరాన్ అణ్వాయుధాల తయారీకి పూనుకోలేదని కాంగ్రెస్ కు నివేదించారు. అంతర్జాతీయ అణు శక్తి సంస్థ కూడా ఇదే విషయాన్ని ధ్రువీకరించింది. అటువంటి పరిస్థితిలో ఈ దాడులకు ఎలాంటి చట్టబద్ధత లేదని స్పష్టమవుతోంది.

**మోడీ ఇజ్రాయెల్ పర్యటన - సమయం, సందర్భం:**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫిబ్రవరి 25న ఇజ్రాయెల్ పార్లమెంట్ నెసెట్లో చారిత్రాత్మక ప్రసంగం చేశారు. ఇదే మొదటిసారిగా ఓ భారత ప్రధాని ఇజ్రాయెల్ పార్లమెంటును ఉద్దేశించి ప్రసంగించడం. ఆయన మాట్లాడుతూ, "అక్టోబర్ 7న హమాస్ చేసిన దాడిలో ప్రపంచం ఛిన్నాభిన్నమైన కుటుంబాలకు భారత ప్రజల తరపున సంతాపం తెలియజేస్తున్నాను. ఈ సమయంలో భారత్ పూర్తి విశ్వాసంతో ఇజ్రాయెల్తో ఉంది" అని ప్రకటించారు.



ఈ పర్యటన సమయం చాలా కీలకం. ఆయన పర్యటన ముగిసిన రెండు రోజుల తర్వాతే అమెరికాఇజ్రాయెల్ దాడులు ప్రారంభమయ్యాయి. ఇంత సున్నితమైన సమయంలో ఇజ్రాయెల్తో బహిరంగంగా స్నేహహస్తం అందించడం, భారత్ ఇంతకాలం అనుసరిస్తున్న తటస్థ వైఖరిపై (అలీన విధానం అనే విదేశాంగ విధానం ) పై ప్రశ్నలు లేవనెత్తింది. అంతర్జాతీయ మీడియా కూడా దీన్ని "అనుమానాస్పద, దౌత్యపరంగా ప్రమాదకరమైన చర్య"గా అభివర్ణించింది .

ఇజ్రాయెల్ జర్నలిస్ట్ ఒకరు మోడీ పర్యటనను నెతన్యాహూ ఎన్నికల ప్రచారానికి "చౌక బారు ప్రకటన"గా అభివర్ణించారు. (గతంలో అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి ఎన్నికల ప్రచారంలో అక్కడి ప్రవాస భారతీయులను ఉద్దేశించి " ఆప్ కా బార్ ట్రంప్ సర్కార్ " అనే నినాదాన్ని గుర్తుకు తెస్తుంది.) ఇజ్రాయెల్ పై అంతర్జాతీయ నేర న్యాయస్థానం వారెంట్ కూడా ఇప్పటికే జారీ చేసిన సమయంలో, గాజాలో జరుగుతున్న విధ్వంసం మధ్య ఈ పర్యటన జరగడం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది .

**భారత్ మౌనం - వ్యూహమా, బలహీనతా?**

ఇరాన్ పై దాడులు జరిగిన తర్వాత భారత్ స్పందన మౌనంగా ఉంది. విదేశాంగ మంత్రిత్వ శాఖ మాత్రం లో గొంతుకతో బలహీనంగా, నీరసంగా "తీవ్ర ఆందోళన" నెమ్మదిగా వ్యక్తం చేసింది. కానీ, ఇరాన్ సార్వభౌమత్వ ఉల్లంఘనపై మాత్రం నోరు తెరవలేదు. స్పష్టమైన నిరసనను కూడా తెలపలేదు . ప్రధాని మోడీ మాత్రం ఇజ్రాయెల్ ప్రధానితో ఫోన్లో మాట్లాడి, "శత్రుత్వాలను త్వరగా ముగించాలని" కోరారు. కానీ ఇరాన్ నేతృత్వానికి కనీసంగా ఫోన్ కూడ (మర్యాద కోసం కూడా ) చేయలేదు. ఈ గ్లోబల్ ప్రపంచంలో ఏ విషయమైనా మనం దాచాలీ అనుకున్నా దాచలేం. అంతర్జాతీయంగా ప్రపంచ దేశాలు, అంతర్జాతీయ మీడియా, భారత ప్రజలు, విపక్షాలు భారత ప్రధాని వైఖరిని గమనిస్తున్నారు.

ఇది భారత్ సంప్రదాయ విదేశాంగ విధానానికి పూర్తిగా విరుద్ధం. గతంలో ఎన్ని సంక్షోభాల్లోనైనా భారత్ అన్ని పక్షాలతో సంభాషణ కొనసాగించేది. కానీ ఇప్పుడు అమెరికా, ఇజ్రాయెల్ వైపు మొగ్గు చూపడం వలన తనదైన "మధ్యవర్తిత్వ పాత్ర" అనే అవకాశాన్ని స్వచ్ఛందంగా కోల్పోయింది. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ ఈ మౌనాన్ని "తటస్థత కాదు, విఫలమైన విదేశాంగం"గా విమర్శించారు .

భారత్ మౌనానికి మరో కారణం కూడా ఉంది. ప్రభుత్వం వాస్తవిక దృక్పథంతో ఆలోచిస్తోంది. గల్ఫ్ దేశాల్లో 1 కోటి మంది భారతీయులు నివసిస్తున్నారు. వీరి భద్రత, చమురు వ్యాపారం, వ్యాపార ప్రయోజనాలు ప్రధానంగా అమెరికాఇజ్రాయెల్ వైపు మొగ్గు చూపిస్తున్నాయి. కానీ, ఈ వాస్తవికతకు, నైతికతకు మధ్య సమతుల్యత కోల్పోయినట్లు కనిపిస్తోంది.

**'చాబహార్ ఓడరేవు' - ప్రశ్నార్థకమైన భవిష్యత్తు:**

ఇరాన్ తో భారత్ సంబంధాల్లో 'చాబహార్ ఓడరేవు' కీలకమైన ప్రాజెక్ట్. ఇప్పటివరకు భారత్ ఈ ప్రాజెక్టో $370 మిలియన్లు పెట్టుబడి పెట్టింది. పాకిస్తాన్ ను దాటవేస్తూ మధ్య ఆసియాకు చేరుకోవడానికి ఇది వ్యూహాత్మక ప్రాధాన్యత కలిగిన మార్గం .

కానీ, ఇప్పుడు ఇరాన్ దృష్టిలో భారత్ శత్రు పక్షంలో చేరింది. ఇరాన్ కొత్త నేతృత్వం వస్తే, శత్రువుతో ఒప్పందాలు చేసుకున్న భారత్ ను అనుమానంతో చూస్తుంది. అమెరికా ఒత్తిడి కారణంగా చాబహార్ ప్రాజెక్ట్ భవిష్యత్తు ఇప్పటికే అనిశ్చితంలో పడింది . ఏప్రిల్ 2026 వరకు అమెరికా మినహాయింపు ఇచ్చింది. కానీ, ఆ తర్వాత ఏం జరుగుతుందో చెప్పలేం.

**నైతికతకు, వాస్తవికతకు మధ్య ఊగిసలాట:**

భారత్ విదేశాంగ విధానం చరిత్రాత్మకంగా నైతిక విలువలపై ఆధారపడి ఉండేది. మహాత్మా గాంధీ "పాలస్తీనా సమస్యను" నైతిక, వలసవాద వ్యతిరేక సమస్యగా భావించారు . 1974లో వర్ణవివక్ష దక్షిణాఫ్రికాతో డేవిస్ కప్ ఫైనల్ ఆడడానికి నిరాకరించింది భారత్. అలాంటి నైతిక వైఖరి నేడు ఎక్కడో కోల్పోయినట్లు కనిపిస్తోంది.

కానీ, ప్రస్తుత ప్రపంచ వాస్తవాలు భిన్నంగా ఉన్నాయి. ఇజ్రాయెల్ టెక్నాలజీ, రక్షణ రంగాల్లో భారత్ కు కీలక భాగస్వామి. గల్ఫ్ దేశాలు చమురు, వ్యాపార, కార్మిక రంగాల్లో భాగస్వాములు. అమెరికా మొత్తం పాశ్చాత్య దేశాలతో సంబంధాలు బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం పూర్తి తటస్థత వహించటం సాధ్యమా అన్నది మరికొందరు భిన్న కోణంలో భావిస్తున్నారు.

**ఇంతకు నష్టపోయేది ఎవరు?:**

ఈ యుద్ధంలో ఏ పక్షం గెలిచినా భారత్ నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ఇరాన్ పక్షం గెలిస్తే, చాబహార్ ప్రాజెక్ట్, మధ్య ఆసియా కనెక్టివిటీ ప్రమాదంలో పడతాయి. అమెరికాఇజ్రాయెల్ పక్షం గెలిస్తే, వారు తమ ప్రయోజనాలకు అనుగుణంగా మధ్యప్రాచ్యాన్ని పునర్నిర్మించుకుంటారు. భారత్ అందులో ద్వితీయ శ్రేణి భాగస్వామిగానే ఉంటుంది.

చైనా ఇప్పటికే ఇరాన్ తో అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. ఇరాన్ కొత్త నేతృత్వం చైనాతో మరింత సన్నిహితంగా ఉండవచ్చు. ఈ పరిణామాలు భారత్ వ్యూహాత్మక ప్రయోజనాలకు విఘాతం కలిగించవచ్చు .

చివరిగా... భారత్ విదేశాంగ విధానం ఒక కీలకమైన దశలో ఉంది. నైతిక విలువలకు, వాస్తవిక ప్రయోజనాలకు మధ్య సమతుల్యం కోల్పోకుండా చూసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఇజ్రాయెల్ వైపు కనిపిస్తున్న మొగ్గు వలన భారత్ "మధ్యవర్తిత్వ పాత్ర" హోదాను కోల్పోయింది. ఇది తాత్కాలిక లాభాలకు దారితీయవచ్చు కానీ, దీర్ఘకాలంలో భారత్ స్వతంత్ర విదేశాంగ విధానానికి విఘాతం కలిగిస్తుంది.

గాంధీజీ బోధించిన నైతిక విలువలకు, నేటి ప్రపంచ వాస్తవిక రాజకీయాలకు మధ్య సమతుల్యం సాధించడమే భారత్ ముందున్న సవాలు. ఇందుకు పార్లమెంట్ ను విశ్వాసం లోకి తీసుకోవాలి. అన్ని విపక్షాలతో సంభాషణ కొనసాగించడం, స్పష్టమైన వైఖరి తీసుకోవడం అవసరం. మౌనం వలన లాభం లేదు. స్పష్టత వలన గౌరవం లభిస్తుంది.

**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్.**
**9849328496.**



# హెరిటేజ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో:**

మహిళలు కేవలం ఇంటికే పరిమితం కాకుండా స్వశక్తితో ఆర్థికంగా ఎదిగి, సమాజంలో ఎందరికో ఆదర్శంగా నిలవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి, హెరిటేజ్ ఫుడ్స్ వైస్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఫరూఖ్ నగర్ మండలం నాగులపల్లి గ్రామ సమీపంలోని ఫంక్షన్ హాల్ లో హెరిటేజ్ సంస్థ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం, పాడి మహిళా రైతులతో ప్రత్యేక ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు.



ఈ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడుతూ.. గత 34 ఏళ్లుగా పాల ఉత్పత్తి రంగంలో హెరిటేజ్ సంస్థ అప్రతిహతంగా కొనసాగుతోందని, ఈ ప్రయాణంలో 50 శాతం వాటా మహిళలదే అని స్పష్టం చేశారు. మహిళల నాయకత్వం, ధైర్యం, మేనేజ్‌మెంట్ సామర్థ్యం అభినందనీయమని కొనియాడారు. ప్రస్తుతం సంస్థకు మహిళా రైతులు ప్రతిరోజూ సుమారు 3 లక్షల లీటర్ల పాలను అందజేస్తూ ఆర్థికంగా బలోపేతం అవుతున్నారని ఆమె హర్షం వ్యక్తం చేశారు. పశువైద్య శిబిరం ద్వారా పాడి పశువుల ఆరోగ్యం, నాణ్యమైన పాల ఉత్పత్తిపై నిపుణులు రైతులకు అవగాహన కల్పించారని,
మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, ముఖ్యంగా పాడి పరిశ్రమలో ఆధునిక మెలకువలు నేర్చుకుంటూ ముందుకు సాగాలని భువనేశ్వరి ఆకాంక్షించారు. ఒక మహిళ ఆర్థికంగా స్థిరపడితే ఆ కుటుంబంతో పాటు గ్రామం, రాష్ట్రం, చివరకు దేశమే బాగుపడుతుందని ఆమె అన్నారు.
మహిళల రక్షణ అనేది కేవలం మాటలకే పరిమితం కాకూడదని, అది ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత అని పేర్కొన్నారు. మహిళలపై అగైత్యాలకు పాల్పడే వారిపై అత్యంత కఠినంగా వ్యవహరించాలని, తద్వారా నేరస్థుల్లో భయం కలగాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పకడ్బందీ రక్షణ చట్టాలను అమలు చేయాలని, మహిళలు నిర్భయంగా తిరిగే వాతావరణం కల్పించాలని డిమాండ్ చేశారు. అంతకముందు కార్యక్రమంలో భాగంగా చిన్నారులు పాడిన గీతాలు అలరించాయి. అనంతరం తెలంగాణ జాతీయ గీతాన్ని ఆలపించి అందరిలో స్ఫూర్తిని నింపారు. ఈ కార్యక్రమాలకు ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో మహిళా పాడి రైతులు తరలివచ్చారు.
ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ సాంబశివరావు, పాల సేకరణ శాఖాధిపతి రామ్మోహన్ రావు, రైతు సంక్షేమ కార్యనిర్వాహణధికారి డాక్టర్ బానోతు శ్రీను, హైదరాబాద్ రిజియన్ పాలసేకరణ అధికారి కే.బీ. నర్సింగ్ రావు, నందిగామ బ్రాంచ్ అధికారులు నరేష్, స్వామి గౌడ్, వెటర్నరీ డాక్టర్ వేణు తదితరులు పాల్గొన్నారు.



## ఉప్పల్ చెరువుల్లో గుర్రపుడెక్క తొలగింపు

**జర్నలిస్ట్ డైరీ, నాగారం:**

నాచారం డివిజన్ హెచ్ఎంటి నగర్ డివిజన్లో దోమల సమస్యకు ప్రధాన కారణమైన హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువు, పటేల్ కుంట చెరువు పూర్తిగా గుర్రపు డెక్కతో నిండి ఉండటంతో దానిని తొలగించేందుకు ఆదివారం చర్యలు చేపట్టారు. ఈ సమస్య పరిష్కారానికి ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవతో కోటి 20 లక్షల రూపాయలు ఒక సంవత్సరం వరకు రెండు చెరువులలో గుర్రపు డెక్క తొలగించి మెయింటెనెన్స్ చేసేందుకు నిధులు మంజూరు చేయించడం జరిగింది.
నేడు హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువులోని గుర్రపు డెక్క తొలగించేందుకు రెండు పెద్ద హిటాచి ఎక్స్‌కవేటర్లను చెరువు వద్దకు తీసుకుని రావడం జరిగింది.
గుర్రపు డెక్క తొలగించే పనులను నాచారం డివిజన్ మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ పర్యవేక్షించడం జరిగింది.
తొందరలోనే పటేల్ కుంట చెరువులో గుర్రపు డెక్క తొలగింపు పనులు కూడా ప్రారంభిస్తామని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ మాజీ డివిజన్ అధ్యక్షులు మేకల ముత్యంరెడ్డి, కట్ట బుచ్చన్న గౌడ్, చంద్రశేఖర్, మక్బూల్, వాసు, రోహిత్, జహీర్, గౌసుద్దీన్, ఈశ్వర్ హెచ్ఎంటి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రామ్, కోటేశ్వరరావు, కిరణ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ లో మహిళా దినోత్సవ వేడుకలు

**జర్నలిస్ట్ డైరీ,ఎల్ బీ నగర్:**

మహిళలు అంకితభావం, నిబద్ధత ఉంటే అన్ని రంగాల్లో రాణిస్తారని ఎల్బీనగర్ సిఐ వినోద్ కుమార్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ లో పనిచేస్తున్న మహిళా పోలీసులకు సన్మానం చేసి బహుమతులను అందజేశారు. ఎల్బీనగర్ పీఎస్ డీఐ నాగార్జునరెడ్డి. ఎస్ఐఐలు తదితరులు పాల్గొన్నారు.





## ఇస్కాన్ ఆలయం భూమి పూజ

**జర్నలిస్ట్ డైరీ రంగారెడ్డి జిల్లా బ్యూరో:**

గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపన్ పల్లి రంగనాథాలయం వద్ద నూతనంగా నిర్మించబోయే ఇస్కాన్ దేవాలయం భూమి పూజ కార్యక్రమంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి, తాజా మాజీ కార్పొరేటర్లు గంగాధర్ రెడ్డి, జగదీశ్వర్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి తో కలిసి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ,కృష్ణ భక్తితత్వం, అధ్యాతికతను వ్యాప్తి చేయడమే గాక పేదల కడుపు నింపుతున్న గొప్ప సంస్థ ఇస్కాన్ సంస్థ అని , గోపన్ పల్లి లో ఇస్కాన్ సంస్థ కు 6 వేల గజాల స్థలం లో ఇస్కాన్ దేవాలయం నిర్మించుకోవడం చాలా శుభపరిణామం అని, కెటయించిన స్థలంలో ఇస్కాన్ దేవాలయం మరియు ఇస్కాన్ సంస్థ గోశాలతో పాటు వంటశాల ఏర్పాటు చేస్తారని తెలియచేసారు. శ్రీకృష్ణ పరమాత్ముడి నామస్మరణతో నగరం పులకరించింది.. హరే కృష్ణ.. హరే రామ భజనలు, నృత్యాలతో భక్తులు పారవశ్యం చెందారు అని వివిధ మఠాల పెద్దలు పాల్గొని కృష్ణ భజనలు, కీర్తలను ఆలపించారు. కన్నుల పండుగ గా భూమి పూజ కొనసాగింది అని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ సంస్థ ప్రతినిధిలు, నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## షాద్ నగర్ లో కేసుల దర్యాప్తుపై అవగాహన

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో:**

ఫ్యూచర్ సీటీ కమిషనరేట్ పరిధిలోని షాద్‌నగర్ డీసీపీ కార్యాలయంలో పోలీసు అధికారులకు కేసుల దర్యాప్తుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ శిరీష రాఘవేందర్ స్థానిక ఏసీపీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణలో కీలక అంశాలపై చర్చించారు. గొడవలు లేదా దాడులు జరిగినప్పుడు కేసులను ఎలా నమోదు చేయాలి, సాక్ష్యాలను ఎలా సేకరించాలి అనే అంశాలపై నందిగామ ఎస్ఐ యాదయ్య, ఏఎస్ఐ శ్రీనివాస్ వివరించారు. ఐటీ విభాగానికి చెందిన పీసీ బాలరాజు ఒక వినూత్న విధానాన్ని పరిచయం చేశారు. ఇకపై ఘటన జరిగిన చోటు నుండే డిజిటల్ పద్ధతిలో ఎఫ్ఐఆర్ నమోదు చేసే విధానంపై అధికారులకు అవగాహన కల్పించారు. డిజిటల్ సాక్ష్యాల సేకరణ వల్ల కేసుల విచారణ వేగవంతం అవుతుందని, బాధితులకు త్వరగా న్యాయం జరుగుతుందని అధికారులు తెలిపారు. షాద్‌నగర్ జోన్ పరిధిలోని ఎస్‌హెచ్‌ఓలు, ఎస్ఐలు ,స్టేషన్ రైటర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బీసీ సేన ఆధ్వర్యంలో మహిళలకు సత్కారం

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో:**

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని షాద్‌నగర్ పట్టణ కేంద్రంలోని ఓల్డ్ ఏజ్ హోమ్ నవోదయ సేవా సంఘంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. బీసీ సేన ఆధ్వర్యంలో మహిళా మణులందరికీ ఘనంగా సత్కరించి, చీరలు , పండ్లు బెడ్లు తదితర ఆహార పదార్థాలను అందించడం జరిగింది.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...
మహిళలు కుటుంబానికి, సమాజానికి అండగా నిలుస్తూ కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. తల్లి, అక్క, చెల్లెలుగా మహిళలు సమాజ నిర్మాణంలో ఎంతో గొప్ప బాధ్యతను నిర్వర్తిస్తున్నారని అన్నారు. మహిళలకు గౌరవం ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని వృద్ధాశ్రమంలోని మహిళలతో కలిసి జరుపుకోవడం తనకు ఎంతో ఆనందంగా ఉందని సదర్ శీను చెప్పారు.
వృద్ధాశ్రమంలో నివసిస్తున్న మహిళలకు పండ్లు, బిస్కెట్లు, అవసరమైన వస్తువులను అందజేశారు.
వారితో కొంతసేపు మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని ధైర్యం చెప్పారు. ప్రతి ఒక్కరూ మహిళలను నేటి సమాజంలో గౌరవించాల్సిన అవసరం ఎంతో ఉందని పేర్కొన్నారు. కుటుంబ వ్యవస్థకు మహిళలే ఆధారం అని, వారి త్యాగం, ప్రేమ వల్లే సమాజం ముందుకు సాగుతుందని అన్నారు. కానీ ఆధునిక కాలంలో కుటుంబ విలువలు కొంత మేర తగ్గిపోతున్నాయని, దాని ప్రభావంగా చాలా మంది వృద్ధ మహిళలను వృద్ధాశ్రమాలకు చేర్పిస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు మనలను పెంచి పెద్దలను చేసిన తర్వాత వారిని వృద్ధాశ్రమాలకు పంపించడం బాధాకరమైన విషయం అని అన్నారు. వృద్ధులను గౌరవిస్తూ.. వారి సంరక్షణ బాధ్యతను ప్రతి కుటుంబం తీసుకోవాలని సూచించారు. మహిళలను గౌరవించడం, వారి సేవలను గుర్తించడం ద్వారానే సమాజం మరింత సుస్థిరంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. మహిళా దినోత్సవం వంటి ప్రత్యేక రోజుల్లో మాత్రమే కాకుండా ప్రతి రోజూ మహిళలకు గౌరవం ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. కుటుంబాల్లో ప్రేమాభిమానాలు పెంపొందించి వృద్ధులను ఆదరించడంలో ప్రతి ఒక్కరూ ముందుండాలని సూచించారు. మహిళల సేవలను గుర్తిస్తూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సమాజంలో సేవాభావం పెంపొందుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. షాద్నగర్ నియోజకవర్గం బీసీ సేన ఇంచార్జ్ ప్యాట జయ శ్రీకాంత్ మాట్లాడుతూ.... మహిళలను ఆయా రంగాలలో ఎదిగేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సేన రాష్ట్ర అధ్యక్షులు వరప్రసాద్ యాదవ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సదర్ శ్రీనివాస్, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి జయ శ్రీకాంత్, కోర్ కమిటీ సభ్యుడు చిన్న బాలరాజ్, హాజీపల్లి మాజీ సర్పంచ్ సింగారం శ్రీనివాస్, కమిటీ సభ్యులు శ్రీకాంత్, షాద్‌నగర్ టౌన్ అధ్యక్షురాలు కే. సరస్వతి, ఉపాధ్యక్షురాలు కే. పద్మ, 16వ వార్డు అధ్యక్షురాలు యాదమ్మతో పాటు ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పిజేఆర్ నగర్ లో మహిళా దినోత్సవం

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో :**

అంతర్జాతీయ మహిళ దినోత్సవం పురస్కరించుకుని ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ పిజేఆర్ నగర్ కమ్యూనిటీ హల్ లో వేడుకలు నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తో పాటు మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు. మహిళ సోదరీమణులతో కలిసి కేక్ కట్ చేసి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సంధర్భంగా గాంధీ మాట్లాడుతూ , అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల కోసం ఇంత పెద్ద కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం అని, మహిళ సోదరీమణులందరికి అంతర్జాతీయ మహిళ దినోత్సవం శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను అని, మహిళల కోసం సంస్కృతిక ప్రదర్శనలు, నిరుపేద మహిళలకు చీరల పంపిణీ, వంటి కార్యక్రమాలు నిర్వహించుకోవడం చాలా అభినదించదగ్గ విషయం అని, మహిళ లు వంటింటికె పరిమితం కాకుండా అంది వచ్చిన అవకాశాలను పునికిపుచ్చుకొని అన్ని రంగాలలో ప్రావీణ్యం సాధించి ఎంచుకున్న రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని, ఆర్థిక స్వాలంబన పొందాలని, పురుషులతో సమానంగా పోటీ పడలని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలియచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళ పక్షపాతి అని, మహిళ సంక్షేమం కోసం ఎంతగానో కృషి చేస్తున్నారు అని, మహిళలను కోటీశ్వరులు చేయడం ధ్యేయం గా పనిచేస్తున్నారు అని , ఆల్విన్ కాలనీ లో మహిళ సోదరీమణులకు ఆర్థిక స్వాలంబన కోసం పెట్రోల్ బంక్ ను ఏర్పాటు చేయడం జరుగుతుంది అని త్వరలోనే ప్రారంభోత్సవం చేసుకుంటామని మహిళ సంఘాల ప్రతినిధులకు ఎంతగానో ఉపయోగపడుతుంది అని చెప్పారు. నేటి కాలంలోని మహిళలు విద్య, వైద్యం, వ్యాపారాలు, రాజకీయాలు, క్రీడలు, అంతరిక్షం, వంటి అన్ని రంగాల్లో అద్భుతంగా రాణిస్తున్నారు అని కొనియాడారు. మహిళలను గౌరవించడం ప్రతీఒక్కరి బాధ్యత అని గుర్తుచేశారు. ఇంత అభివృద్ధి చెందిన ఆధునిక సమాజంలో కూడా ఇంకా మహిళలను చిన్న చూపు చూస్తూ, కించపరుస్తూ, వారి మీద అఘాయత్నాలు చేస్తున్న మానవ మృగలను కఠినంగా శిక్షించాలని అన్నారు. విధిరాతను ఎదిరించి ఆత్మగౌరవానికి ప్రతీక నిలుస్తూ ఎందరో నారీమణులు చరిత్రలో తమకంటూ ఓ స్థానాన్ని సాధించుకున్నారు.. వారందరిని స్మరించుకుంటూ స్త్రీ మూర్తులందరికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను అని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు మరియు మహిళ సోదరీమణులు పాల్గొన్నారు.





## వివిధ వర్గాల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు

**జర్నలిస్ట్ డైరీ, నాగారం:**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉప్పల్ డివిజన్ ఇందిర నగర్ ప్రతిభ మాదిగ జాగృతి మహిళా సంఘం, లక్ష్మీనారాయణ కాలనీ మహిళా సంఘం రామంతాపూర్ ఆధ్వర్యంలో లో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఉప్పల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ రజితా పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం అనేది సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక మరియు రాజకీయ విభాగాలలో మహిళల విజయాలను గుర్తించి గౌరవించడానికి వార్షిక ప్రపంచ వేడుకగా పేర్కొన్నారు.. ఈ మహిళల దినోత్సవం అనేక రంగాలలో మహిళల విజయాలను గుర్తించడానికి మరియు రూపం సమానత్వం కోసం వాదించడానికి అంకితం చేయబడిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ మాదిగ జాగృతి మహిళా సంఘం అధ్యక్షురాలు చెరుకు జయమ్మ, ఉపాధ్యక్షురాలు గంజాయ్ యాదమ్మ, దప్పు సునీత, రాపుల హారిక, చెరుకు లావణ్య, దప్పు మౌనిక, ఒక్కసు శిరీష, నాగోల్ భాగ్యలక్ష్మి, మమత, గంజాయి శిరీష, లక్ష్మీనారాయణ కాలనీ వాసులు పాల్గొన్నారు.



## 5 కే రన్ ను ప్రారంభించిన గాంధీ

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో:**

గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల హుడా కాలనీ లో నల్లగండ్ల స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 5 కే రన్ లో పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని జెండా ఊపి ప్రారంభించి, విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ, 5 కే రన్ నిర్వహించడం చాలా అభినందనియం అని, నేటి ఉరుకుల పరుగుల జీవి శారీరక శ్రమ ఎంతో అవసరం అని గుర్తు చేయడానికి ఎంతగానో తోడ్పడుతుంది అని ఎంతో మందికి స్ఫూర్తి గా నిలుస్తుంది అని , వృద్ధులు , యువత , చిన్న పిల్లలు పాల్గొనడం ఎంతో ఆనందయాకం అని , ప్రతి ఒక్కరు ఆరోగ్యము పట్ల ఎంతో శ్రద్ధ వహించాలని, శారీరక శ్రమ వలన మానసిక ఉల్లాసం , ప్రశాంతత చేకూరుతుంది అని, మారిన జీవన శైలి లో ప్రతి ఒక్కరు తప్పనిసరిగా వ్యాయమం చేయాలని, ఈ రన్ ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది అని , ఇది ఒక మంచి శుభపరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మంత్రి ప్రగడ సత్యనారాయణ, నల్లగండ్ల స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మంత్రిప్రగడ శాలి మిత్ర, వైస్ ప్రెసిడెంట్ నరేశ్, ప్రతాప్,ప్రభాకర్ రెడ్డి మరియు విష్ణు వర్ధన్ రెడ్డి, వేణు గోపాల్ రెడ్డి ,సురేష్ నాయక్, కిరణ్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

# కమ్యూనిటీ ఆసుపత్రిలో హెచ్‌పీవీ టీకా కార్యక్రమం

**జర్నలిస్ట్ డైరీ రంగారెడ్డి జిల్లా బ్యూరో:**

మహిళ ల్లో వేగంగా విస్తరిస్తోన్న గర్భాశయ ముఖద్వార (సర్వైకల్) క్యాన్సర్ ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం చేపట్టిన హెచ్‌పీవీ టీకా మందు వల్ల మహిళలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. 14 ఏళ్ల బాలికలకు పంపిణీ చేసేందుకు రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో ప్రభుత్వ ఆధ్వర్యంలో హెచ్‌పీవీ టీకా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ లాంచనంగా ప్రారంభించారు. డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ విజయలక్ష్మి, ఆస్పత్రి డాక్టర్ విష్ణువర్ధన్ తదితరుల ఆధ్వర్యంలో ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో మొదటి హెచ్. పి.వి టీకా డోసును బాలికకు ఇచ్చారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమాజంలో ప్రస్తుతం క్యాన్సర్ మహమ్మారి పెరిగిపోతుందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దీనిని పారదోలవడానికి ఎంతో కృషి చేస్తున్నాయని అన్నారు.
వ్యాక్సిన్ వేయించుకునేందుకు బాలిక తన తల్లిదండ్రుల తోసహా ఆరోగ్యకేంద్రానికి ఆధార్ కార్డుతోసహా రావాలనీ నిర్ణీత ఫారంలో వివరాలను నింపిన తర్వాత వాటిని ఆధార్ కార్డుకు లింకైన ఫోన్ నంబరుతో యువిన్ పోర్టల్‌లో నమోదుచేసి ఆయుష్మాన్ భారత్ (అభా)ఐడీని ఇస్తారన్నారు. దీని ఆధారంగా బాలిక ఫోటోను నిర్ధారించుకుని టీకామందు వేస్తారనీ, ఆ వెంటనే వ్యాక్సిన్ వేయించుకున్నట్టుగా బాలికకు యువిన్ పోర్టల్‌లో సర్టిఫికెట్ జారీఅవుతుందనీ ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బస్వం, వైస్ చైర్మన్ అందె మోహన్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయలక్ష్మి, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం, మాజీ జడ్పీటీసీ విశాల శ్రవణ్ రెడ్డి, కౌన్సిలర్లు మురళీ మోహన్(అప్పి), దిలీప్,బచ్చలి నరేష్ ముబారక్ అలీ ఖాన్, గంగమనిసత్తయ్య, శ్రీనివాస్, మధవులు, ఖదీర్, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.







# ఎండకు మీ అందం కందిపోతుందా..?

ప్రస్తుతం వేసవి కావడంతో ఎండలు దంచికొడుతున్నాయి. అధిక ఉష్ణోగ్రత్తలు నమోదవుతుండడంతో ప్రజలు బయటకు వెళ్లేందుకు ఇబ్బందిపడుతున్నారు. తప్పని పరిస్థితుల్లో వెళ్లేవారు కొంత ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా యువత తెగ టెన్షన్ పడుతున్నారు. అందం కందిపోతుందని, అలా కాకుండా ఎటువంటి జాగ్రత్తలుతీసుకోవాలని తెలుసుకుంటున్నారు. ఈ క్రమంలో వైద్య నిపుణులు పలు సూచనలు చేస్తున్నారు. 'వేసవిలో శరీరం డీహైడ్రేషన్‌కు గురై నీటిని ఎక్కువగా కోల్పోతుంది. దీంతో చర్మం, జుట్టు నిర్జీవంగా మారుతాయి. పొడి చర్మం, చుండ్రు వంటి సమస్యలు ఇబ్బంది పెడతాయి. అదేవిధంగా బయటకు వెళ్లే సమయంలో పలు జాగ్రత్తలు తీసుకోకపోతే అందం కూడా కందుతుంది. ముఖం నల్లగా మారే అవకాశం లేకపోలేదు. ఇలా కాకుండా ఉండాలంటే.. తగినన్ని నీళ్లు తాగాలి. అప్పుడే చర్మం హైడ్రేటెడ్‌గా ఉంటుంది. శరీరం నుంచి టాక్సిన్స్‌ను బయటికి పంపుతుంది. జుట్టుకూ మేలుచేస్తుంది. అదేవిధంగా ఇంట్లో నుంచి బయటకు వెళ్లేటప్పుడు గొడుగు లేదా, తలకు క్యాప్ వాడాలి. అదేవిధంగా ఎండలు, దాహం నుంచి ఉపశమనం పొందడానికి కూల్‌డ్రింక్స్‌ను ఎక్కువగా ఆశ్రయిస్తుంటారు. వీటితోపాటు చక్కెర కలిపిన పానీయాలను కూడా ఎక్కువగా తీసుకుంటుంటారు. అయితే, ఇవి రెండూ కూడా రక్తంలో చక్కెర స్థాయులను పెంచుతాయి. ఫలితంగా, చర్మంపై ముడతలు, దద్దుర్లు ఏర్పడతాయి. జుట్టుకు చేటు చేస్తుంది. వెంట్రుకలను బలహీనపరుస్తుంది. అది కాస్త జుట్టు రాలే సమస్యను పెంచుతుంది.
ఎండ వల్ల మానసిక, శారీరక ఒత్తిడికి గురై జుట్టు, చర్మం ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. ముఖ సౌందర్యాన్ని దెబ్బతీస్తాయి. మొటిమలు, బ్లాక్ హెడ్స్ రావడానికి కారణం అవుతాయి. అందువల్ల.. వేసవిలో చక్కెరకు ఎంతదూరం ఉంటే.. అందానికి అంతమంచిది' అని నిపుణులు సూచిస్తున్నారు.

# ఇందుకోసమేనా పాలను వేడి వేడిగా తాగుతారు..?



పాల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కానీ, ఎక్కువ మందిని పాలను వేడి చేసుకుని తాగుతుంటారు. ఆ పాలను తాగుతున్నంత సేపు రిలీఫ్ గా ఉంటారు. ఆ తరువాత హ్యాపీగా ఫీలవుతుంటారు. అదేవిధంగా రెగ్యూలర్ గా పాలను తీసుకునేవారిలో మార్పు కూడా కనిపిస్తుంటుంది. పాల వల్ల ఎన్నో రకాల ప్రయోజనాలుంటాయని వైద్య నిపుణులు చెబుతుంటారు. 'రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తుంది. చర్మానికి ఎంతగానో మేలు చేస్తాయి. జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. ఎముకలు కూడా బలంగా తయారవుతాయి. జీర్ణ క్రియకు తోడ్పడుతుంది'తోపాటు పలు ప్రయోజనాలు చేకూరుతాయని సూచిస్తుంటారు. అయితే, పాలను వేడి చేసుకుని తాగితే ఇంకా ప్రయోజనాలుంటాయని సూచిస్తున్నారు. 'వేడి వేడిగా పాలను తీసుకోవడం వల్ల మలబద్దకం సమస్య దూరమవుతుంది. అందువల్ల మలబద్ధకంతో బాధపడేవారు ప్రతిరోజూ వేడి వేడి పాలను తీసుకోవడం బెటర్. అదేవిధంగా బాగా అలసటగా ఉన్నప్పుడు కూడా హుషారు రావాలంటే కూడా వేడి పాలను తీసుకోవాలి. ముఖ్యంగా చిన్న పిల్లలకు ఇది బాగా మేలు చేస్తుంది. గొంతు నొప్పితో బాధపడే వాళ్ళు పాలలో కాస్త మిరియాల పొడి వేసుకుని వేడివేడిగా తాగితే చక్కటి రిలీఫ్ ని పొందుతారు. వేడి వేడి పాలను తీసుకోవడం వల్ల మానసిక ఒత్తిడి కూడా దూరమైపోతుంది. దంతాలు కూడా ఆరోగ్యంగా ఉంటాయి. వీటితోపాటు మంచి నిద్ర కూడా మీ సొంతమవుతుంది' అంటూ వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.




# నిమ్మకాయను ముఖంపై నేరుగా అప్లై చేసుకోవొచ్చా...?

నిమ్మకాయలో సీ విటమిన్ పుష్కలంగా ఉంటుంది. సాధారణ రోజుల్లో కూడా నిమ్మకాయను తీసుకుంటారు. అదే ఎండాకాలంలో అయితే తప్పకుండా విరివిగా తీసుకుంటారు. కొంతమంది తమ ముఖాన్ని అందంగా, కాంతివంతంగా, మచ్చలు లేకుండా ఉండేందుకు నిమ్మకాయను పలు రకాలుగా అప్లై చేస్తుంటారు. అయితే, ఈ నిమ్మకాయ పలు సందర్భాల్లో ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం లేకపోలేదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. 'నిమ్మకాయను వాడేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. నిమ్మకాయను ముఖానికి నేరుగా అప్లయి చేయకూడదు. ఇలా చేస్తే ఒక్కొక్కసారి చర్మం పాడయ్యే అవకాశం ఉంటుంది. చర్మంపై ముడతలు, దురద, మంట, ఎర్రబడటం, పొక్కులు వచ్చే ప్రమాదం ఉంటుంది. మొటిమల సమస్యను పెంచి, ముఖంపై నల్లటి మచ్చలు ఏర్పడే అవకాశం లేకపోలేదు. ఎండలోకి వెళ్లినప్పుడు వడదెబ్బకు గురయ్యే ఛాన్స్ ఉంది' అని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

# పిల్లలకు తిండి విషయంలో ఆప్షన్ ఇస్తున్నారా? తిప్పతలు తప్పవు..!

ప్రతి తల్లిదండ్రి కూడా తమ పిల్లలను అల్లారుముద్దగా పెంచుతారు. వారి విషయంలో కఠినంగా వ్యవహరించడానికి ఏమాత్రం ఇష్టపడరు. ప్రతి విషయంలో వారికి చాయిస్ ఇస్తారు. ఆహారం విషయంలో కూడా వారికి రకరకాల ఆప్షన్స్ ఇస్తాం. వారు వీరు అని కాదు. ఇంట్లోని ప్రతి ఒక్కరూ చిన్న పిల్లల విషయంలో వారికి కష్టపెట్టడం ఇష్టం లేకనో, వారిపై ఉన్న అమితమైన ప్రేమ వల్లనో వారికి నచ్చింది అందించడానికి ప్రయత్నిస్తారు. 'చిన్నీ.. ఇడ్లీ తింటావా? దోశ తింటావా? ఎగ్ కర్రీ చేయాలా? బీర కాయ కర్రీ చేయాలా?..' ఇలా దాదాపు ప్రతి తల్లీ తమ పిల్లలకు ఆప్షన్లు ఇస్తూనే ఉంటారు. దాదాపు ప్రతి ఇంట్లో ప్రతిరోజూ ఇటువంటి సీనే కనిపిస్తుంది. కానీ ఇది ఏమాత్రం మంచిది కాదని నిపుణులు చెప్తున్నారు. తల్లిదండ్రులు చూపే ఈ ప్రేమ.. పిల్లలపై చెడు ప్రభావం చూపుతాయని అంటున్నారు వైద్య నిపుణులు. ఇది కాలక్రమంలో ఇబ్బందై కూర్చుంటుంది. మీరు ఏది వండినా అది కాకుండా వేరొకటి అడిగే పరిస్థితి వస్తుందని చెప్తున్నారు.



**అయిష్టాలను సీక్రెట్‌గానే ఉంచండి..**

చాలా కుటుంబాల్లో పెద్దవారు కూడా అది తినను, ఇది తినను అంటారు. ఇంట్లో వండి వంటలు తినను అని చెప్పి బయట తినే సమయాలు కూడా ఉంటాయి. అలా మీరు ఏదైనా కూరగాయలు, ఆకుకూరలు, మాంసం, చేపలు, గుడ్లు, చికెన్ వంటివి తిననిపక్షంలో ఆ విషయం చిన్నారులకు తెలియాల్సిన అవసరం లేదు. తెలియకుండా ఉంచడమే మంచిది. వారి ముందు కూడా మీరు మీకు కొన్ని నచ్చవన్న సంగతిని ఇతరులతో చర్చించకుండా ఉండడమే మంచిది. పిల్లలకు తెలిస్తే కొన్నింటిపై అయిష్టంతో వాటిని పక్కన పెట్టొచ్చని గ్రహిస్తారు. తాము కూడా కొన్నింటిని అకారణంగా పక్కన పెట్టేస్తారు. ఒకవేళ అది పౌష్టికాహారంలో భాగమైన పదార్థం అయితే ఆ పిల్లలు నష్టపోయిన వారవుతారు.
ఉదాహరణకు బీ12 విటమిన్ మాంసంలోనే దొరుకుతుంది. వారు మటన్ తినడంపై అయిష్టం పెంచుకుంటే ఇక జన్మలో వాళ్లను మీరు మార్చలేరు. అలాగే కొందరు నాకు చికెన్ అంటే ఇష్టం లేదంటారు. మరికొందరు ఫిష్ అంటే ఇష్టం లేదంటారు. ఆకు కూరలు అంటే ఇష్టం లేదంటారు. బీర కాయ వద్దంటారు. ఇందుకు ప్రత్యేక కారణం అంటూ ఏదీ ఉండదు. ఒక్కో కూరగాయకు ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. ముఖ్యంగా పిల్లల్లో సక్రమంగా జీర్ణక్రియ సాగేందుకు కూరగాయలు, ఆకుకూరలు తప్పనిసరి అని గమనించాలి.

**ఆప్షన్లు ఇస్తే జరిగేది ఇదే..**

పిల్లలకు రెండేళ్ల వయస్సు వచ్చాక ఇంట్లో పెద్దవారు తినేవి అన్నీ తినిపించవచ్చు. ఏడాది వయస్సు వచ్చినా పెద్దవాళ్ల తినేవి అన్నీ తినిపించవచ్చు. కానీ కాస్త మెత్తటి ఆహారం ఇవ్వాలి. అయితే రెండు మూడేళ్లు ఉన్న పిల్లలకు ఆహారం ఇచ్చేటప్పుడు ఆప్షన్లు అస్సలు ఇవ్వకూడదు. బ్రేక్ ఫాస్ట్ చేస్తావా? లేదా లంచ్ చేస్తావా? డిన్నర్ చేస్తావా? స్నాక్స్ తింటావా? అని మాత్రమే అడగాలి. కానీ బ్రేక్ ఫాస్ట్ చేసేటప్పుడు ఇడ్లీ తింటావా? పూరి తింటావా? ఉప్మా తింటావా? ఇలా ఆప్షన్లు ఇవ్వడం ప్రారంభిస్తే రేపు మీరిచ్చిన అన్ని ఆప్షన్లనూ తిరస్కరిస్తారు. వీలైతే కుటుంబ సభ్యులందరూ కలిసి తినడం వల్ల పిల్లలకు భోజన క్రమశిక్షణ అలవడుతుంది.

**ఆ టైమ్‌లో అస్సలు అడగకండి..**

పిల్లలు టీవీ చూస్తున్నప్పుడు, మొబైల్ చూస్తున్నప్పుడు వారిని తింటావా అని అడకండి. వాళ్లు టీవీలో, మొబైల్‌లో నిమగ్నమవుతారు తప్ప వారు తినే ఆహారాన్ని శ్రద్ధతో తినరు. దీని వల్ల వారు తమ ఆకలిని మించి తినేస్తారు. ఇది చివరకు ఊబకాయానికి దారితీస్తుంది. తిండి తినేటప్పుడు వారు ఏం తింటున్నారో గ్రహింపు ఉండేలా తినడం వారి జీర్ణక్రియకు మేలు చేస్తుంది.

**బలవంత పెట్టొద్దు..**

పిల్లలు తమ నిరసన తెలిపేందుకు పలుసార్లు నేను తిననంటూ మారాం చేస్తుంటారు. ఈ సమయంలో మీరు బలవంతం చేయడం వల్ల ఉపయోగం ఉండదు. వారికి ఆకలి అనిపించినప్పుడు వాళ్లే తింటారు. అలాగే కొందరు తల్లిదండ్రులు బలవంతంగానూ, చిన్నారుల సామర్థ్యానికి మించి తినిపిస్తుంటారు. ఇది కూడా మంచిది కాదు. వారికి ఆహారంపై ఆసక్తి పోయే ప్రమాదం ఏర్పడుతుంది.

**ఆహారం గురించి వివరించండి..**

ఆహారం ప్రాధాన్యతను, విభిన్న రకాల ఆహారాల ప్రాముఖ్యతను పిల్లలకు వివరించండి. వీలైతే విటమిన్లు, వాటి ఉపయోగాల గురించి తప్పకుండా చర్చించండి. అలాగే జంక్ ఫుడ్, షుగర్స్, శాచ్యురేటెడ్ ఫ్యాట్స్ గురించి చెబుతూ అవి చేసే హాని గురించి చర్చించండి.



# భోజనం చేశాకా నీళ్లు ఎందుకు తాగకూడదు?

భోజనం చేసిన తర్వాత నీళ్లు తాగడం చాలా సాధారణం. ప్రతి ఒక్కరికీ ఇదొక అలవాటు కూడా. కానీ కొందరు మాత్రం భోజనం చేసే సమయంలో నీళ్లు తాగకూడదని అంటే మరికొందరు భోజనం చేసిన తర్వాత గంట వరకు నీళ్లు తాగకూడదని మరికొందరు అంటారు. ఆయుర్వేదం కూడా ఇదే విషయం చెప్తోంది. భోజనం చేసిన వెంటనే నీళ్లు తాగకూడదని. సాధారణంగా అయితే నీరు తాగడం మనకు ఎంతో ప్రయోజనకరం. ఇది మనల్ని హైడ్రేటెడ్‌గా ఉంచడమే కాకుండా అవయవాలు సక్రమంగా తమ పని చేయడానికి దోహదపడతాయి. కానీ భోజనం చేసిన తర్వాత తాగితే మాత్రం మేలు చేయకపోగా కీడు చేస్తాయని అంటున్నారు. అసలు భోజనం తర్వాత మంచినీళ్లు ఎందుకు తాగకూడదు. నిపుణులు ఏమంటున్నారు.

**భోజనం తర్వాత నీళ్లు ఇందుకే తాగకూడదు..**

ఆయుర్వేదం చెబుతున్న ప్రకారం ఆహారం తిన్న వెంటనే నీరు త్రాగడం వల్ల జీర్ణరసాలు పలుచగా మారతాయి. దీనివల్ల జీర్ణక్రియ సవ్యంగా సాగదు. అజీర్తి వంటి సమస్యలు వస్తాయి. ఇది నిజమేనని సైన్స్ కూడా చెబుతోంది. భోజనం తిన్న వెంటనే నీరు తాగితే బరువు త్వరగా పెరుగుతారని, ఊబకాయం బారిన పడే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. భోజనం చేసిన తర్వాత వెంటనే నీరు తాగడం వల్ల ఆహారాన్ని జీర్ణం చేయడానికి, జీర్ణవ్యవస్థ తీసుకునే సహజ సమయాన్ని నీరు తాగడం ద్వారా మార్చేస్తున్నట్టే లెక్క. దీనివల్ల ఊహించిన దాని కంటే ముందుగానే ఆకలి వేస్తుంది. అప్పుడు అతిగా తింటారు. కడుపు ఉబ్బరం వంటి సమస్యలు కూడా వస్తాయని చెబుతున్నారు వైద్యులు.
భోజనం తర్వాత శరీరంలో చేరిన నీరు జీర్ణ ఎంజైములను పల్చగా మారుస్తుంది. దీనివల్ల ఎసిడిటీ సమస్య వస్తుంది. గుండెల్లో మంట కూడా రావచ్చు. ఆహారం తిన్న వెంటనే నీరు తాగడం వల్ల జీర్ణం కాకుండా ఆహారం చాలా వరకు మిగిలిపోతుంది. ఇది కొవ్వు రూపంలో నిల్వ అవుతుంది. ఈ ప్రక్రియ ఇన్సులిన్ స్థాయిలను అమాంతం పెంచుతాయి. దీనివల్ల మధుమేహం వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. ఇక మధుమేహం ఉన్నవారు భోజనం తిన్న వెంటనే నీటిని తాగకూడదు. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతాయి.

**ఎప్పుడు తాగాలి?**

భోజనం తినడానికి అరగంట ముందు, భోజనం తిన్న అరగంట తర్వాత నీరు తాగడం ఉత్తమం అని వివరిస్తున్నారు ఆయుర్వేద వైద్యులు. ఇది ఆహారాన్ని మృదువుగా మారుస్తుంది. అయితే చల్లటి నీటిని మాత్రం తాగకూడదు. ఎందుకంటే అన్నం తిన్న వెంటనే చల్లటి నీరు తాగడం వల్ల జీర్ణక్రియ తీవ్రంగా ప్రభావితం అవుతుంది. జీర్ణవ్యవస్థలో టాక్సిన్స్ పేరుకుపోయే అవకాశం ఉంది. యాసిడ్ రిఫ్లెక్స్ వంటి సమస్యలు కూడా రావచ్చు. అలాగే భోజనం తినేటప్పుడు కెఫీన్ నిండిన పానీయాలు, కూల్ డ్రింకులు కూడా తాగడం మానేయాలి.



# పిల్లలు గుమ్మడికాయ తినడం లేదా.. ఇలా ట్రై చేయండి..!

పిల్లలు ఆహారం విషయంలో చాలా మొండిగా ప్రవర్తిస్తుంటారు. పలానా కూరగ తినను అంటే ఇక అంతే.. కొట్టినా తిట్టినా వారు వాటిని తినరు. ఇలా చాలా మంది చిన్నారులు అయిష్టత చూపే కూరగాయల్లో గుమ్మడికాయ కూడా ఒకటని చెప్పొచ్చు. ఇలా ఆహారాన్ని చాలా పర్టిక్యులర్‌గా ఆహారం తినే పిల్లలకు లంచ్ బాక్స్ కట్టాలన్నా, స్నాక్స్ పెట్టాలన్నా, భోజనం తినిపించాలన్నా అదో యుద్ధంలా మారుతుంది. ఇలా గుమ్మడి కాయ అంటే అయిష్టత చూపుతుంటే.. వారి కోసం ప్రత్యేక రెసిపీ ఉంది. ఇలాంటి సందర్భాల్లో మీరు వారికి ఆరోగ్యకరమైన, రుచికరమైన కబాబ్‌లను తయారు చేసి లంచ్ బాక్స్‌లో ప్యాక్ చేయవచ్చు. ఈ రుచికరమైన స్నాక్స్ ను పిల్లల బాక్సుల్లో పెట్టి పంపారంటే పిల్లలు వదలకుండా తినేస్తారు. ఇలా చేయడం వల్ల పిల్లలకు కూరగాయలు తినిపించడం గురించి చింతించాల్సిన అవసరం లేదు. కూరగాయలతో కబాబ్‌లు ఎలా తయారు చేయాలో తెలుసుకుందాం.


**కావలసిన పదార్థాలు:**

అర కప్పు గుమ్మడికాయ, అర కప్పు క్యారెట్ ముక్కలు, అర కప్పు కాలిఫ్లవర్ ముక్కలు, ఒక కప్పు మష్రూమ్స్, ఒక ఉల్లిపాయ, అర కప్పు నానబెట్టిన పెసరపప్పు, వంద గ్రాముల పనీర్, అర కప్పు శెనగపిండి, రెండు పచ్చిమిర్చి, 56 వెల్లుల్లి రెబ్బలు, బాగా తరిగిన కొత్తిమీర, అల్లం ముక్క, రుచికి తగినంత ఉప్పు, ధనియాలు ఒక చెంచా, అర చెంచా నల్ల మిరియాలు, రెండు లవంగాలు, రెండు యాలకులు

**తయారు చేసే విధానం..**

మొదట గుమ్మడికాయ, కాలిఫ్లవర్, క్యారెట్‌లను శుభ్రం చేసి పెద్ద పెద్ద ముక్కలుగా కట్ చేయండి. నానబెట్టిన పెసర పప్పును కూడా శుభ్రం చేసి పక్కన పెట్టుకోండి. ఇప్పుడు ఒక కుక్కర్ తీసుకుని దాంట్లో కట్ చేసిన కూరగాయలు, పెసరపప్పులతో పాటు కట్ చేసిన ఉల్లిపాయను వేసి ఒక విజిల్ వచ్చేవరకూ ఉంచండి. ఇప్పుడు గ్రైండర్ లేదా మిక్సీ జార్‌లో అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి, కొత్తిమీర వేయండి. పొడి మసాలా దినుసులు నల్ల మిరియాలు, కొత్తిమీర, లవంగాలు, యాలకులను కూడా వేసి బాగా మెత్తగా మెత్తని పేస్ట్ చేయండి. ఈ మిశ్రమంలోనే ఉడికించిన కూరగాయలను వేసి బాగా కలపండి. నీరు వేయకుండానే కూరగాయల నుండి వచ్చే నీటితోనే దీన్ని కచ్చాపచ్చాగా ఉండే పేస్టులా తయారు చేయండి. ఇప్పుడు ఒక బౌల్‌లో అన్నివేసి పేస్ట్‌లా తయారు చేయండి. తర్వాత దానిలో పనీర్‌ను తురిమి వేయండి. చివరగా దీంట్లోనే శనగపిండి, రుచికి తగినంత ఉప్పు వేసి బాగా కలపండి. తరువాత ఈ మిశ్రమాన్ని చిన్న చిన్న కబాబ్ లాగా చేసి, తక్కువ నూనెలో వేయించండి. రుచికరమైన కూరగాయల కబాబ్‌లు సిద్ధం. ఈ కబాబ్‌లను పిల్లలకు పెట్టారంటే వదలకుండా తినేస్తారు. బరువు తగ్గాలనుకునే వారికి కూడా చాలా బాగా సహాయపడుతుంది.







# సాయి శ్రీనివాస్ మనసు దోచిన కావ్య ఎవరు? బెల్లంకొండ వారి ఇంట్లో మొదలైన పెళ్లి సందడి!

టాలీవుడ్‌లో వరుస పెళ్లిళ్లతో సందడి నెలకొంది. యంగ్ హీరోలు విజయ్ దేవరకొండ, అల్లు శిరీష్ ఇప్పటికే ఒక ఇంటివారవ్వగా, ఇప్పుడు ఆ జాబితా లోకి మాస్ అండ్ యాక్షన్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కూడా చేరిపోయారు. ఆయన వివాహ వేడు కలకు సంబంధించిన తొలి అడుగు పడింది. ప్రముఖ నిర్మాత బెల్లంకొండ సురేశ్ తనయుడు, హీరో బెల్లం కొండ సాయి శ్రీనివాస్ త్వరలోనే బ్యాచిలర్ లైఫ్‌కు గుడ్ బై చెప్పబోతున్నారు. ఆదివారం ఉదయం ఆయన నిశ్చితార్థానికి ముందు జరిగే 'రోకా' (Roka) వేడుక అత్యంత వైభవంగా జరిగింది.

**ఎవరీ కావ్య..**

సాయి శ్రీనివాస్ మనసు దోచుకున్న అమ్మాయి పేరు కావ్య. ఈమె హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ న్యాయవాది కుమార్తె. కావ్యకు సినీ పరిశ్రమతో ఎటువంటి సంబంధం లేదు. వీరిద్దరూ గత కొంత కాలంగా ప్రేమలో ఉన్నారని, పెద్దల అంగీకారంతో ఇప్పుడు వివాహ బంధంలోకి అడుగుపెడుతున్నార ని సమాచారం. హైదరాబాద్‌లో జరిగిన ఈ రోకా వేడుకకు కుటుంబ సభ్యులతో పాటు సినీ పరిశ్రమ కు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. సాయి శ్రీని వాస్‌కు కెరీర్ బిగినింగ్‌లో మాస్ ఇమేజ్ తెచ్చిపెట్టిన దర్శకుడు బోయపాటి శ్రీను, హీరోయిన్ సంయుక్త తదితరులు ఈ వేడుకలో పాల్గొని నూతన వధూవరు లను ఆశీర్వదించారు. దీనికి సంబంధించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 'అల్లుడు శీను' చిత్రంతో టాలీవుడ్‌లోకి గ్రాండ్‌గా ఎంట్రీ ఇచ్చిన సాయి శ్రీనివాస్, 'జయ జానకి నాయక', 'రాక్షసుడు' వంటి చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఇటీవల 'కిష్కింధ పురి'తో ఆకట్టుకున్న ఆయన, ప్రస్తుతం 'హైందవ', 'టైసన్ నాయుడు' వంటి భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు.



# 'రంగస్థలం' ఒక బెంచ్‌మార్క్.. చిట్టిబాబు మేకోవర్ వెనుక అసలు కథ ఇదే: సుస్మిత కొణిదెల

మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ నటనా ప్రస్థానంలో 'రంగస్థలం' ఒక క్లాసిక్. సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ రికార్డులను తిరగరాయడమే కాకుండా, చరణ్‌లోని అసలైన నటుడిని ప్రపంచానికి పరిచయం చేసింది. ఈ సినిమాకు కాస్ట్యూమ్ డిజైనర్‌గా, స్టైలి-స్ట్‌గా వ్యవహరించిన చరణ్ సోదరి సుస్మిత కొణిదెల తాజాగా ఎన్టీవీ పాడ్‌కా-స్ట్‌లో ఆనాటి షూటింగ్ విశేషాలను పంచుకున్నారు. కొన్ని సినిమాలు కేవలం కలెక్షన్ల కోసమే వస్తాయి, కానీ మరికొన్ని సినిమాలు చరిత్రలో ఒక 'బెంచ్‌మార్క్'గా నిలిచిపోతాయి. రామ్ చరణ్ కెరీర్‌లో 'రంగస్థలం' అటువంటి అరుదైన చిత్రమ-ని సుస్మిత కొణిదెల అభిప్రాయపడ్డారు. పల్లెటూరి నేపథ్యం, 1980ల కాలం నాటి వాతావరణం, ఆ సహజత్వం.. ఇలా ప్రతి విషయంలోనూ ఈ సినిమా ఒక కొత్త ఒర-వడిని సృష్టించింది. ఒక స్టైలిస్ట్‌గా తనకు ఈ సినిమా ఒక పెద్ద సవాల్‌తో కూడిన ప్రయాణమని ఆమె గుర్తు చేసుకున్నారు. రామ్ చరణ్‌ను 'చిట్టిబాబు'గా మార్చడం వెనుక జరిగిన కసరత్తు గురించి సుస్మిత వివరిస్తూ.. "చరణ్ కెరీర్‌లోనే ఇది మర్చి-పోలేని మేకోవర్. గడ్డం పెంచడం నుంచి, పంచె కట్టు, ఆ బనియన్లు, ఆ కాలం నాటి రంగులు.. ప్రతిదీ చాలా సహజంగా ఉండాలని ప్లాన్ చేశాం. చిట్టిబాబు పాత్ర కోసం చేసిన ఆ క్యారెక్టరైజేషన్, మేకోవర్ కోసం పని చేయడం నాకు ఒక గొప్ప అనుభూతిని ఇచ్చింది" అని చెప్పారు. చరణ్ ఆ పాత్రలో పరకాయ ప్రవేశం చేశాడని, ఆ రూపురేఖలు సినిమా విజ-యానికి ప్రధాన బలంగా నిలిచాయని పేర్కొన్నారు. పల్లెటూరి వాతావరణంలో, ఎండలో సహజత్వానికి దగ్గరగా షూటింగ్ చేయడం ఒక సాహసమని అన్నారు. "రంగస్థలం సెట్స్ మీద ఉండటం అంటే ఒక అద్భుతమైన జర్నీ. అప్పట్లో మనం చూసిన పల్లెటూరి వాతావరణాన్ని మళ్లీ కళ్లముందు ఉంచడం కోసం టీమ్ అంతా చాలా కష్టపడింది. అలాంటి ప్రాజెక్టులు జీవితంలో ఒకసారి మాత్రమే వస్తాయి" అని అన్నారు. ఈ సినిమా ద్వారా తెలుగు చిత్ర పరిశ్రమలో ఒక కొత్త బెంచ్‌మార్క్ సెట్ అయ్యిందని అభిప్రాయపడ్డారు. నట-నలోనైనా, మేకింగ్‌లోనైనా రంగస్థలం ఒక పాఠంలాంటిదని, రామ్ చరణ్‌ను ఒక విల-క్షణ నటుడిగా నిలబెట్టిన ఘనత ఈ చిత్రా-నిదేనని కొనియాడారు. సుస్మిత కొణిదెల మాటలు వింటుంటే, రంగస్థలం వెనుక ఎంతటి కృషి ఉందో అర్థమవుతోంది.

# నయనతార నెక్స్ట్ ప్లాన్ అదిరిపోయిందిగా!



దక్షిణాదిలో అత్యధిక పారితోషికం తీసుకునే హీరోయిన్లలో ఒకరైన నయనతార, ఇప్పుడు బాలీవుడ్‌పై మళ్లీ ఫోకస్ పెట్టింది. మెగాస్టా-ర్ చిరంజీవితో కలిసి నటించిన 'విశ్వంభర' (శంకర్ వరప్రసాద్) సినిమాతో భారీ విజయాన్ని అందు-కున్న నయన్, ప్రస్తుతం హిందీలో ఒక క్రేజీ ప్రాజెక్టుకు ఓకే చెప్పినట్లు తె-లుస్తోంది. ముంబైకి చెందిన ప్రముఖ నిర్మాణ సంస్థ 'మినీ ఫిల్మ్స్' నిర్మిం-చబోయే ఒక భారీ చిత్రంలో ఆమె నటించనుందట. గతంలో 'ఫోరె-న్సిక్', 'ఆంఖో కి గుస్తాకియా' వంటి విభిన్నమైన చిత్రాలను అందించిన ఈ సంస్థ, నయనతార కోసం ఒక పవర్‌ఫుల్ కథను సిద్ధం చేసిందట. కథతో పాటు తన పాత్రకు ఉన్న ఇంపార్టెన్స్ నచ్చడంతో నయనతార వెంటనే ఈ ప్రాజెక్టుకు సానుకూలత వ్యక్తం చేసినట్లు సమాచారం. నిజానికి 'జవాన్' సినిమా తర్వాత నయనతారకు బాలీవుడ్ నుండి కుప్పలు తెప్పలుగా ఆఫర్లు వచ్చాయి. కానీ, కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, పెర్ఫార్మెన్స్‌కు స్కోప్ ఉన్న పాత్రలనే ఆమె ఎంచు-కుంటోంది. ఈ కొత్త సినిమా కోసం ఆమెకు భారీ స్థాయిలో రెమ్యునరే-షన్ కూడా ఆఫర్ చేసినట్లు టాక్ వి-నిపిస్తోంది. ఒకవైపు యష్‌తో కలిసి నటిస్తున్న 'టాక్సిక్' (Toxic) సినిమా విడుదలకు సిద్ధమవుతుండగా, మరోవైపు ఈ కొత్త హిందీ ప్రాజెక్టు-తో నార్త్ ఆడియన్స్‌ను అలరించేం-దుకు నయన్ రెడీ అవుతోంది. త్వర-లోనే ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడనుంది. నయనతార తన సెకండ్ బాలీవుడ్ మూవీతో ఎలాంటి రికార్డులు సృష్టి-స్తుందో చూడాలి.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465